

**తొలివెలుగు** జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
**సెల్ : 9491134365**

TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA

**విలేకరులు కావలెను**
**తొలివెలుగు** జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
**సెల్ : 9491134365**

| యాదాద్రిభువనగిరి | సంపుటి: 01 | సంచిక:38 | గురువారం | 3.సెప్టెంబర్.2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue:38 | Thursday | 3.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |



# ఢిల్లీలో సీఎం రేవంత్

- రాజ్‌నాథ్, రామ్మోహన్‌నాయుడితో భేటీ
- 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026'కు రక్షణ మంత్రి ఆహ్వానం
- డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని విజ్ఞప్తి
- ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాల అభివృద్ధిపై రామ్మోహన్‌నాయుడితో చర్చ



**న్యూఢిల్లీ:** ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశమయ్యారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో భేటీ అయి రాష్ట్ర అభివృద్ధి, మౌలిక వసతులకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.

### 'ఇన్వెస్ట్ తెలంగాణ'కు రాజ్‌నాథ్‌కు ఆహ్వానం

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026'కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. సమ్మిట్‌లో భాగంగా నిర్వహించనున్న డిఫెన్స్ ఎక్స్‌పోలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యం కావాలని కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర వద్ద ప్రతిపాదించిన డీఆర్‌డీఎల్ ప్రా జెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని రాజ్‌నా థ్‌సింగ్‌ను సీఎం విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రక్షణ రంగానికి సంబంధించిన పరిశ్రమలు, ప్రాజెక్టుల అభివృద్ధికి కేంద్ర సహకారం అందించాలని కోరారు.

### ఆదిలాబాద్ విమానాశ్రయంపై విజ్ఞప్తి

ఆదిలాబాద్ విమానాశ్రయం పునరుద్ధరణ అంశాన్ని కూడా రేవంత్‌రెడ్డి రక్షణ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విమానాశ్రయ అభివృద్ధి కోసం ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ పూర్తయిందని తెలిపారు. అవసరమైతే మరో 750 ఎకరాలు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

### విమానాశ్రయాల అభివృద్ధిపై చర్చ

అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో రేవంత్‌రెడ్డి సమావేశమ య్యారు. తెలంగాణలో విమానాశ్రయాల విస్తరణ, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా ఆదిలాబాద్, వరంగల్ మామునూరు విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలో కొత్త విమానా శ్రయాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో విమానయాన మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు కేంద్రం సహకరి ంచాలని సీఎం కోరారు. ఈ సమావేశాల్లో మంత్రి గడ్డం వివేక్, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ముందు సీఎంపై చర్యలు తీసుకోండి

## ఎవరిని అడిగి, ఏ హక్కుతో సభల్లో టికెట్లు ప్రకటిస్తున్నారు?

- పదేళ్లు తానే సీఎంగా ఉంటానని చెప్పుకోవడం క్రమశిక్షణా చర్యలకు కిందకు రాదా?
- నాకో న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా?
- కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదు
- అసలు నాకు నోటీసు ఇవ్వడమే తప్పు
- బీసీ వర్గానికి చెందిన మహిళా నాయకురాలిని కావడంతోనే నన్ను లక్ష్యంగా చేసుకున్నారు
- ఎవరు ఇలా చేస్తున్నారో నాకన్నీ తెలుసు
- వారి పేర్లు బయటపెడితే మరో వివాదం తలెత్తుతుంది
- క్రమశిక్షణ విషయంలో అందరికీ ఒకే విధానం ఉండాలి
- నేను చెప్పాల్సిన విషయాలన్నీ పార్టీ పెద్దలకు వివరించా
- అధిష్ఠానం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నా
- ఢిల్లీలో మీడియాతో మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్:** తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేస్తూ షోకాజ్ నోటీసు ఇవ్వడం సరికాదని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆమె పెళ్లి చేసుకుని స్వతంత్రంగా జీవిస్తున్నా రని, తన కుమార్తె వ్యాఖ్యలను తాను సమర్థించనని, అదే సమయంలో వాటిని ఖండించనని స్పష్టం చేశారు. అసలు తనకు నోటీసు ఇవ్వడమే తప్పని పేర్కొన్నారు. బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అనంతరం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన సురేఖ.. తనపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎవరిని అడిగి, ఏ హక్కుతో బహిరంగ సభల్లో ఎమ్మెల్యే టికెట్లు ప్రకటిస్తున్నారని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో టికెట్లు ఎవరికి ఇవ్వాలో తానే నిర్ణయించుకుంటున్నట్లు సీఎం చెప్పడం క్రమశిక్షణా చర్యలకు వర్తించదా అని నిలదీశారు. పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్‌రెడ్డి ప్రకటించుకోవడం కూడా ఇదే పరిధిలోకి రాదా అని ప్రశ్నించారు.

### బీసీ మహిళననే లక్ష్యంగా చేశారా?

తాను బీసీ వర్గానికి చెందిన మహిళా నాయకురాలిననే కారణంతోనే తనను లక్ష్యంగా చేసుకుంటున్నారనే అభిప్రాయాన్ని సురేఖ వ్యక్తం చేశారు. తనకు ఒక న్యాయం, ఇతరులకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. ఇతర మంత్రులు, వారి కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చినప్పుడు పార్టీ తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని, మంత్రిగా సమర్థంగా పనిచేస్తూ ప్రజలకు సేవ చేస్తున్నానని తెలిపారు. తనపై కావాలనే కొందరు నేతలు ఆరోపణలు చేయిస్తున్నారని, ఎవరు ఇలా చేస్తున్నారో తనకు తెలుసని సురేఖ అన్నారు. అయితే వారి పేర్లు వెల్లడిస్తే మరో వివాదం తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. తనపై ఆరోపణలు చేసిన వారికీ షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ తరువాయి 2లో



కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన.. ఎటు చూసినా

# విధ్వంసం, వికృతమే


- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారు
- కాళేశ్వరంపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారు
- రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల

2

# కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరు

- బీఆర్ఎస్ హయాంలో పేదలకు రేషన్‌కార్డులూ ఇవ్వలేదు
- కాంగ్రెస్ ప్రభుత్వం 15 లక్షల కొత్త కార్డులు మంజూరు
- రైతులకు రూ.1.74 లక్షల కోట్లు అందించాం
- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వెయ్యి రోజుల పాలన
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు వేల కోట్లు ఎలా సంపాదించారో చెప్పాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2



# హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చుతున్నరు

- ఇదే రేవంత్ సర్కార్ సాధించిన ప్రగతి
- ప్రజా వ్యతిరేక విధానాలు, నెరవేరని హామీలతో
- కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన
- ఉద్యమకారుల నెత్తురు చిందిన నాటి నుంచే సర్కార్ పతనానికి కౌంట్‌డౌన్
- బీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

2



# కొండాపై తుది నిర్ణయం అధిష్ఠానానిదే

- సీఎం రేవంత్‌రెడ్డి, మీనాక్షి నటరాజన్‌తో కలిసి అధిష్ఠానానికి నివేదిక సమర్పించాం
- పార్టీ బలోపేతం, వెయ్యి రోజుల పాలనపై ఖర్గే, కేసీ వేణుగోపాల్‌కు వివరించాం
- వచ్చే రెండున్నరేళ్లు సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని అధిష్ఠానం సూచించింది
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

2

# కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించను

- పార్టీని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వను
- సమయం వస్తే బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు
- వైఎస్సార్ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చా
- ఆయన ఆశయాల సాధనకు కట్టుబడి ఉంటా
- మునుగోడు ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డి

2



అయోధ్య రామాలయం తొలి సీఈఓగా

# జితేంద్ర మిశ్రా

- రిటైర్డ్ ఎయిర్ మార్షల్‌కు కీలక బాధ్యతలు
- ఆపరేషన్ సిందూర్‌లో పశ్చిమ వైమానిక కమాండ్‌కు నేతృత్వం
- 5,585 దరఖాస్తుల్లో ఎంపిక

2

# నేపాల్‌కు భారత్ ఆపన్నహస్తం

- తొలి రోజే స్పందించి సహాయ సామగ్రి, నిపుణుల బృందాల తరలింపు
- ఇండియా నిజమైన మిత్రదేశంగా అండగా నిలిచిందన్న నేపాల్ ప్రధాని బాలెన్ షా
- వరదల్లో 11,993 మంది రక్షణ.. 3,916 మంది గల్లంతు

2







# కాంగ్రెస్‌ది చీటింగ్ సర్కార్

- ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసింది
- ఆరు గ్యారంటీల పేరుతో 420 హామీలు ఇచ్చి మోసం చేశారు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

# ముందు సీఎంపై చర్యలు తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

కోరాలని, క్రమశిక్షణ విషయంలో పార్టీలో అందరికీ ఒకే విధానం ఉండాలని కోరారు.

### అధిష్ఠానం నిర్ణయం కోసం ఎదురుచూపు

తనపై వచ్చిన ఆరోపణలు, రాష్ట్ర కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలపై ఖర్గేతో వివరంగా చర్చించినట్లు సురేఖ తెలిపారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్ తదితర అధిష్ఠాన నేతలకు ఇప్పటికే రాతపూర్వకంగా వివరణ ఇచ్చానన్నారు. కేసీ వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ మాత్రం లభించలేదని చెప్పారు. మీనాక్షి నటరాజన్‌కు తన వివరణ అందించానని, విషయాన్ని అధిష్ఠానానికి తెలియజేస్తానని ఆమె చెప్పినట్లు వివరించారు. మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఇప్పటివరకు అధిష్ఠానం నుంచి ఎవరూ చెప్పలేదని సురేఖ స్పష్టం చేశారు. తాను చెప్పాల్సిన విషయాలన్నీ పార్టీ పెద్దలకు వివరించానని, వారి నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నానని తెలిపారు. తాను మంత్రిగా కొనసాగాలని అధిష్ఠానాన్ని కోరినట్లు చెప్పారు. తనపై చర్యలు తీసుకుంటే బీసీ వర్గాల్లో తీవ్ర స్పందన ఉంటుందని పేర్కొంటూ.. పార్టీలోని అన్ని వర్గాలకూ సమాన న్యాయం చేయాలని కోరారు.

# కొండాపై తుది నిర్ణయం అధిష్ఠానానిదే

**న్యూఢిల్లీ:** మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ అధిష్ఠానానికి ఇవ్వాల్సిన సమాచారాన్ని ఇప్పటికే అందించామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కొండా సురేఖపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంలో తుది నిర్ణయం కాంగ్రెస్ అధిష్ఠానానిదేనని స్పష్టం చేశారు. బుధవారం దిల్లీలోని ఇందిరాభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.

### అధిష్ఠానానికి పాలన, పార్టీ పరిస్థితిపై వివరాలు

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జి కేసీ వేణుగోపాల్‌కు వివరించేందుకు దిల్లీకి వచ్చినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. బూత్ స్థాయి నుంచి పీసీసీ వరకు పార్టీని బలోపేతం చేస్తున్న తీరును అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. పార్టీ నిర్మాణం, ప్రభుత్వ పాలనపై ఖర్గే, కేసీ వేణుగోపాల్ సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. వచ్చే రెండున్నరేళ్లలోనూ పేదలకు సమర్థంగా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో పార్టీని మరింత పటిష్ఠం చేయాలని వారు సూచించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. కొండా సురేఖ వ్యవహారంలో పార్టీ అంతర్గతంగా జరిగిన పరిణామాలపై అవసరమైన వివరాలను అధిష్ఠానానికి అందించామని, తదుపరి నిర్ణయం అక్కడి నుంచే వెలువడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించను

**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీలో కొత్తగా చేరిన కొందరు పెత్తనం చెలాయించేందుకు ప్రయత్నిస్తున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ఆరోపించారు. పార్టీని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని, అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని స్పష్టం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్‌లోని తాజా పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో వైఎస్సార్‌కు లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని, రాజకీయాల్లో ఉన్నంతకాలం వైఎస్సార్ ఆశయాల సాధన కోసం పనిచేస్తానని తెలిపారు. ఆయనను ఎప్పటికీ మరచిపోబోనని చెప్పారు.

### కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వను

ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడబోనని రాజ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకుని పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌పై ఆధిపత్యం చెలాయించేందుకు చేస్తున్న ప్రయత్నాలను సహించబోనని తేల్చిచెప్పారు.

### ‘ఆ సమయం వస్తే బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు’

కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు ‘సీఎం.. సీఎం’ అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్‌రెడ్డి.. తనను సీఎం కావాలని కోరుకుంటూ నినాదాలు చేస్తున్నారని అన్నారు. ‘‘ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు’’ అని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చి ‘రాజన్న రాజ్యం’ కొనసాగిస్తామని రాజ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

# కాంగ్రెస్‌ది ‘చీటింగ్ సర్కార్’

**హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. ప్రజలకు ఒరిగిందేమిటని ప్రశ్నిస్తే అబద్ధాలు, అనవసర ఆర్భాటాలు, హామీల అమలులో వైఫల్యమే కనిపిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆరు గ్యారంటీలతో పాటు 420 ఉప హామీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రోజుకో కొత్త సాకు వెతుక్కోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కు ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హామీల వర్షం కురిపించారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ విధానంగా మారిందన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక వాటిని మరిచిపోవడం.. ఎన్నికలు సమీపించినప్పుడు మళ్లీ కొత్త హామీలు ఇవ్వడం కాంగ్రెస్ మార్కు పాలన అని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఒకే తరహా విధానాలతో 12 ఏళ్లుగా తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బిల్లుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. వృద్ధులు, వితంతువులకు రూ.4,000 పింఛన్ ఇస్తామని చెప్పి.. ఇప్పటివరకు ఎంతమందికి అందించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. యువతకు ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. వెయ్యి రోజుల పాలనలో ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? ఎంతమంది నిరుద్యోగులకు భృతి అందించారు? అని ప్రశ్నించారు. ఏటా రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, రైతులు, భూయజమానులు, అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమకారులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి.. 420 హామీలతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరు

**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని అప్పులమయం చేసి తమకు అప్పగించిందని ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. వరుస ఎన్నికల్లో ఓటములు ఎదురైనా బీఆర్ఎస్ నాయకులకు ఇంకా జ్ఞానోదయం కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలపై ఆయన తీవ్రంగా స్పందించారు. కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు మరోసారి క్షమించే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సంస్కారహీనంగా ఉన్నాయని మండిపడ్డారు.



### రైతులకు రూ.1.74 లక్షల కోట్లు

ప్రజాపాలనకు వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా సామాన్యుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బకాయిలను చెల్లించడంతోపాటు, అప్పులను కూడా తీర్చుతున్నామని చెప్పారు. రైతును రాజుగా చేయాలనే లక్ష్యంతో పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు ఇప్పటివరకు రూ.1.74 లక్షల కోట్లు అందించామని తెలిపారు. గతంలో ‘వరి వేస్తే ఉరే’ అంటూ రైతులను భయపెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరికి బోనస్ అందిస్తున్నామని, వరి సాగులో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. రైతులకు భరోసా కల్పించేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

### 15 లక్షల కొత్త రేషన్‌కార్డులు

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు పేదలకు రేషన్‌కార్డులు కూడా ఇవ్వలేదని పొంగులేటి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలోపే 15 లక్షల కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. మరోవైపు దాదాపు మూడు లక్షల మంది వృద్ధులు, వితంతువులకు కొత్తగా పింఛన్లు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.భద్రాచలం అభివృద్ధికి రూ.1,000 కోట్లు ఇస్తామని గతంలో కేసీఆర్ ప్రకటించినప్పటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసి చూపిస్తామని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నగరానికి 30–40 కిలోమీటర్ల దూరంలో, జనావాసాలకు దూరంగా నిర్మించారని పొంగులేటి ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం జనావాసాల మధ్య, ఖరీదైన ప్రాంతాల్లో ‘ఇందిరమ్మ టవర్లు’ నిర్మిస్తోందని తెలిపారు.

### ధరణి అక్రమాలను సరిదిద్దుతున్నాం

ధరణి పోర్టల్ కారణంగా ఏర్పడిన సమస్యలను భూభారతి పోర్టల్ ద్వారా పరిష్కరిస్తున్నామని మంత్రి తెలిపారు. ధరణిలో జరిగిన అక్రమాలను 22ఏ నిబంధనల ద్వారా సరిదిద్దుతున్నామని చెప్పారు. 22ఏ కారణంగా నిజమైన లబ్ధిదారులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. హైదరా బాద్ లోని విలువైన భూములను పొరుగు రాష్ట్రాలకు చెందిన వారికి కట్టబెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పొంగులేటి ఆరోపించారు. ఓఆర్సీలు జారీ చేసి హైదరాబాద్ భూములను అక్రమంగా అనుచరులకు అప్పగించారని విమర్శించారు. కవిత చేస్తున్న ఆరోపణలకు హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలను బయటపెడతానని హెచ్చరించారు.

### బీఆర్ఎస్ నిధులపై ప్రశ్నలు

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు తొమ్మిదేళ్లలో వేల కోట్ల రూపాయలు ఎలా సంపాదించారో ప్రజలకు వివరించాలని పొంగులేటి ప్రశ్నించారు. వారి కుటుంబం ఏ వ్యాపారం చేసి అంత మొత్తంలో సంపాదించిందో చెప్పాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్నంత భారీ మొత్తం దేశంలోని మరే రాజకీయ పార్టీ ఖాతాలో లేదని మంత్రి వ్యాఖ్యానించారు. కేసీఆర్ పార్టీకి వేల కోట్ల రూపాయల విరాళాలు ఎవరు ఇచ్చారు? ఎందుకు ఇచ్చారు? అనే విషయాలను వెల్లడించాలని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికల ఖర్చును తానే భరిస్తానని గతంలో కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ.. అంతటి భారీ మొత్తాన్ని సమకూర్చుకునేంత డబ్బు ఆయనకు ఎక్కడి నుంచి వచ్చిందో ప్రజలకు చెప్పాలని పొంగులేటి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా బాధ్యతాయుతంగా మాట్లాడాలని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని మంత్రి సూచించారు.

# 7న బీజేవైఎం చలో ఇందిరాపార్క్

**హైదరాబాద్:** రాష్ట్రంలోని 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే, కార్యదర్శి భరత్ విమర్శించారు. రూ.15 వేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను నిలిపివేసి, విద్యార్థుల ఉన్నత చదువుల కలలను కల్లలు చేస్తోందని ఆరోపించారు. జీవో 97తో పాలిటెక్నిక్ విద్యార్థుల భవితను కాలరాసిందన్నారు. విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం బీజేవైఎం ఆధ్వర్యంలో ఈనెల 7న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు నాంపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో విద్యార్థి మహాధర్నా పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. మహాధర్నాకు రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నట్టు తెలిపారు. రియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర పార్టీ ఆఫీసుపై దాడిచేసిన యూత్ కాంగ్రెస్ నాయకులపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎస్సీ మోర్చా నేతలు ప్రశ్నించారు. ఎస్సీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాంతికిరణ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతంరావు, వేముల అశోక్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ప్రభాగౌడ్ బుధవారం పార్టీ ఆఫీసులో మీడియాతో మాట్లాడారు. దాడి విషయంలో పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

# నేపాల్‌కు భారత్ ఆపన్నహస్తం

**కాఠ్‌మాండు:** ప్రకృతి విపత్తుతో తీవ్రంగా దెబ్బతిన్న నేపాల్‌కు భారత్ అందించిన మానవతా, సాంకేతిక సహాయంపై ఆ దేశ ప్రధాని బాలెన్ షా కృతజ్ఞతలు తెలిపారు. వరదలు సంభవించిన తొలిరోజే భారత్ స్పందించి అవసరమైన సహాయ సామగ్రిని పంపిందని పార్లమెంటులో పేర్కొన్నారు. మందులు, ఆహార పదార్థాలు, నీటి శుద్ధి పరికరాలతో పాటు నిపుణులైన సహాయక బృందాలను భారత్ పంపిందని వివరించారు. నష్టం తీవ్రతను అంచనా వేసేందుకు భారత బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించాయని షా తెలిపారు.

భారత సాంకేతిక నిపుణులు, సహాయక బృందాలు మారుమూల ప్రాంతాలకు సైతం చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నాయని చెప్పారు. సంక్షోభ సమయంలో భారత్ నిజమైన మిత్రదేశంగా నేపాల్‌కు అండగా నిలిచిందని ప్రశంసించారు.

### 11,993 మంది రక్షణ

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటివరకు 11,993 మందిని రక్షించినట్లు బాలెన్ షా వెల్లడించారు. మరో 3,916 మంది గల్లంతైనట్లు తెలిపారు. విపత్తు నేపథ్యంలో మంత్రులంతా తమ నెల జీతాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. రసువా, నువాకోట్ జిల్లాలకు చెరో రూ.కోటి చొప్పున అత్యవసర నిధులు కేటాయించినట్లు వెల్లడించారు.ఈ విపత్తు రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాలకే పరిమితం కాలేదని.. దేశం మొత్తానికీ తీరని నష్టాన్ని మిగిల్చిందని షా పేర్కొన్నారు. సంక్షోభాన్ని ధైర్యం, సంకల్పంతో ఎదుర్కోవడం తప్ప మరో మార్గం లేదని అన్నారు.

### భారత్ నుంచి విస్తృత సహాయక చర్యలు

విపత్తు అనంతరం భారత్ నేపాల్‌లో భారీ స్థాయిలో మానవతా, సాంకేతిక సహాయక చర్యలు చేపట్టింది. రెస్క్యూ బృందాలతో పాటు వైద్య నిపుణులు, డీఎన్ఏ ఆధారిత గుర్తింపు ప్రక్రియ కోసం ఫోరెన్సిక్ నిపుణులను పంపించింది. నేపాల్, చైనా అధికారులతో సమన్వయం కోసం భారత విదేశాంగ శాఖలో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను సమన్వయం చేస్తూ అవసరమైన సాంకేతిక, వైద్య సహాయాన్ని అందిస్తోంది.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన.. ఎటు చూసినా విధ్వంసం, వికృతమే




**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్‌ను విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎటు చూసినా విధ్వంసం, వికృతమే కనిపిస్తోందని ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. ‘పీడన’ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దంలోనే అతిపెద్ద మోసంగా కేటీఆర్ అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో చేర్చి 30 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పెద్దగా అభివృద్ధి పనులు చేపట్టకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు.

### రుణమాఫీపై కేటీఆర్ విమర్శలు

రైతులకు రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి.. కేవలం రూ.20 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని కేటీఆర్ ఆరోపించారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ప్రమాణం చేశారని గుర్తుచేశారు. హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణను అన్నపూర్ణగా తీర్చిదిద్దితే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను నాశనం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం అంతర్గతంగా పోరాడుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రైతుబంధు పథకానికి ప్రాధాన్యం తగ్గించి ‘రాహుల్ బంధు’కు ప్రాధాన్యం ఇస్తున్నారని ఎద్దేవా చేశారు.

### కాళేశ్వరంపై కక్షతో వ్యవహరిస్తున్నారని ఆరోపణ

కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. రైతులకు సాగునీరు అందించేందుకు మాత్రం నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

### ‘జాబ్‌లెస్ క్యాలెండర్’ ఇచ్చారు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో ‘జాబ్‌లెస్ క్యాలెండర్’ ఇచ్చారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌లో పలు అంశాలను ప్రస్తావించారు.

# హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చుతున్నరు

**హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆ ప్రభుత్వంపై టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. వెయ్యి రోజుల పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలు, నెరవేరని హామీలే కనిపించాయని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదల జీవితాలను మెరుగుపరిచేందుకు చేసిందేమీ లేదని, కొందరి స్వార్థ ప్రయోజనా లకే ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించారు.

హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని కవిత మండిపడ్డారు. సంక్షేమ గురుకులాల్లో భద్రతా లోపాలతో విద్యార్థులు మృత్యువాత పడుతున్నారని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు సకాలంలో విడుదల కాక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు.

### శాంతిభద్రతలపైనా విమర్శలు

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని కవిత ఆరోపించారు. నేరాలు నిత్యకృత్యంగా మారాయని విమర్శించారు. పేదలు, విద్యార్థులు, నిరుద్యోగు లు, రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఇవే కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన అసలైన ‘ప్రగతి’ అంటూ ఎద్దేవా చేశారు.

### సర్కార్ పతనానికి కౌంట్‌డౌన్

తెలంగాణ ఉద్యమకారుల నెత్తురు చిందిన నాటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని కవిత వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వానికి కాలం చెల్లిపోయిందని అన్నారు.

ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ విధానాలపై చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని కవిత తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ ప్రజల ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# పాస్ పుస్తకాలు ఇవ్వకుండా రోడ్డున పడేస్తున్నారు: హరీశ్‌రావు

**హైదరాబాద్:** సాదా బైనామా పేరుతో రైతుల నుంచి ఫీజులు వసూలు చేసి.. పాస్ పుస్తకాలు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారిని రోడ్డున పడేస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. మక్తల్ రైతులు బుధవారం హరీశ్‌రావును కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాదాబైనామా క్రమబద్ధీకరణ పేరుతో రైతుల దగ్గర వేలాది రూపాయలు వసూలు చేసి.. పాస్ పుస్తకాలు ఇవ్వకుండా నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం ఏ రకమైన ప్రజాపాలన సీఎం రేవంత్‌రెడ్డి అని ప్రశ్నించారు. సొంత భూమి కోసం మక్తల్ నియోజకవర్గ రైతులు పడుతున్న అవస్థలే ఈ కాంగ్రెస్ సర్కార్ చేతకానితనానికి, నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎకరానికి రూ.23 వేల నుంచి రూ.26 వేల వరకు ఫీజులు కట్టించుకుని నెలలు గడుస్తున్నా.. రైతుల భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదని అన్నారు. చేతిలో 13–బి సర్టిఫికెట్లు ఇచ్చి.. భూభారతి పోర్టల్‌లో టెక్నికల్ ఇష్యూ ఉందని, పైనుంచి ఆదేశాలు రావడం లేదని చెప్పి ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ రైతులను తిప్పుతున్నారని ఆరోపించారు. పాస్ పుస్తకం లేదు.. ఆన్‌లైన్‌లో పేరు లేదు.. ఫలితంగా రైతుబంధు అందడం లేదని పేర్కొన్నారు. 62 వేల మంది రైతుల నుంచి ఫీజులు ముక్కుపిండి వసూలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వారి భూములకు సంబంధించిన రికార్డులను ఎందుకు క్లియర్ చేయడం లేదని నిలదీశారు. ఇప్పటికైనా రైతుల భూములతో చెలగాటం ఆపాలని.. వెంటనే భూభారతి పోర్టల్‌లోని సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించిన ప్రతి రైతుకూ పాస్ పుస్తకాలు జారీ చేయాలని లేదంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.

వేదికల మీద సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ వేల కోట్ల లాభాల్లో ఉన్నదని గొప్పలు చెబుతున్నారని.. ఆర్టీసీ ఎండీ మాత్రం ప్రభుత్వం నుంచి రూ.2,600 కోట్ల బకాయిలు రావాలని లేఖ రాస్తారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాగితాల మీద ఆర్టీసీ లాభాల్లో ఉందంటారు.. క్షేత్రస్థాయిలో మాత్రం ఉద్యోగులు, విశ్రాంత కార్మికుల జీవితాలను అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు.

# అయోధ్య రామాలయ తొలి సీఈఓగా జితేంద్ర మిశ్రా

**అయోధ్య:** అయోధ్య రామ మందిర నిర్వహణ, కార్యకలాపాలను పర్యవేక్షించే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియమితులయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పశ్చిమ వైమానిక కమాండ్ (డబ్ల్యూఏసీ)కు ఆయన నేతృత్వం వహించారు. ట్రస్ట్ అధికారులు బుధవారం నియామకాన్ని వెల్లడించారు. మొత్తం 5,585 దరఖాస్తులను పరిశీలించిన ఎంపిక కమిటీ.. ముగ్గురు అత్యంత అర్హులైన అభ్యర్థులతో తుది జాబితా రూపొందించి మిశ్రాను ఎంపిక చేసింది. ఆలయ విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, ఎనిమిది మంది అరెస్టు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా నేపథ్యంలో సీఈఓ నియామకానికి ప్రాధాన్యం ఏర్పడింది. రిటైర్డ్ న్యాయమూర్తి ప్రమోద్ కోహ్లీ నేతృత్వంలోని కమిటీలో రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ విష్ణుకాంత్ చతుర్వేది, మాజీ శాస్త్రవేత్త సురేశ్ హవారే సభ్యులుగా ఉన్నారు. నాయకత్వం, నిర్వహణ నైపుణ్యం, నిజాయితీ, దార్శనికత తదితర అంశాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఏఐ ఆధారిత స్క్రీనింగ్‌తో పాటు మాన్యువల్ పరిశీలన చేపట్టారు. దరఖాస్తుదారుల్లో 3,577 మంది 600 మార్కుల మూల్యాంకనానికి అవసరమైన వివరాలు సమర్పించారు. 470కి పైగా మార్కులు సాధించిన 108 మందిని వర్చువల్ ఇంటరాక్షన్‌కు ఎంపిక చేశారు. అనంతరం ఆగస్టు 11, 12 తేదీల్లో అయోధ్యలో 16 మందిని వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ చేసి తుది జాబితా రూపొందించారు.

### 39ఏళ్లకు పైగా వైమానిక దళంలో సేవలు

ఉత్తరప్రదేశ్‌లోని దేవరియా జిల్లాకు చెందిన జితేంద్ర మిశ్రా 1986 డిసెంబర్ 6న ఫైటర్ పైలట్‌గా వైమానిక దళంలో చేరారు. 39 ఏళ్లకుపైగా సేవల అనంతరం 2026 ఏప్రిల్ 30న పదవీ విరమణ చేశారు. 3,000 గంటలకు పైగా విమానయాన అనుభవం ఉన్న ఆయన ఫైటర్ స్క్వాడ్రన్‌తో పాటు రెండు కీలక వైమానిక స్థావరాలకు కమాండ్ చేశారు. ఏఎస్‌టీఈ కమాండెంట్‌గా, ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 2025 జనవరి 1న పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతిగా బాధ్యతలు చేపట్టడానికి ముందు డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ (ఆపరేషన్స్)గా పనిచేశారు. 2025 మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో డబ్ల్యూఏసీ కీలక పాత్ర పోషించగా.. మిశ్రా నాయకత్వంలో దాని కార్యకలాపాల సన్నద్ధత, నిర్వహణ ప్రశంసలు అందుకుంది. ఆపరేషన్‌లో ఆయన పాత్రకు సర్వోత్తమ యుద్ధ సేవా పతకం లభించగా.. అతి విశిష్ట సేవా పతకం, విశిష్ట సేవా పతకాలను కూడా అందుకున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ టెస్ట్ పైలట్స్ స్కూల్, అమెరికాలోని ఎయిర్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్, బ్రిటన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్‌లో మిశ్రా శిక్షణ పొందారు. సుదీర్ఘ సైనిక, పరిపాలనా అనుభవంతో ఇప్పుడు రామ మందిర ట్రస్ట్ నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నారు.

# జపాన్, జర్మన్ భాషలతో ఎక్కువ ఉద్యోగావకాశాలు: మంత్రి వివేక్



**న్యూఢిల్లీ:** విద్యార్థులు జపాన్, జర్మనీ భాషలను నేర్చుకుంటే.. ఆ దేశాల్లో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. అందుకే రాష్ట్రంలో వందలాది మందికి జర్మన్ భాష నేర్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. బుధవారం ఆయన దిల్లీలోని ఇందిరా భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ‘‘జపాన్, జర్మనీ పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడ పనిచేస్తున్న తెలంగాణ వాళ్లు కలిశారు. అక్కడ ఉపాధి అవకాశాలు చాలా ఉన్నాయని, అందుకు ఆ దేశాల భాషలు రావాలని చెప్పారు. అందుకే ప్రభుత్వం విదేశీ భాషలను, నైపుణ్యాలను నేర్పిస్తోంది. టామ్‌కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో మన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది.

వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసింది. రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, సన్నబియ్యం, 17 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇలా అనేక హామీలను నెరవేర్చింది. నైరాశ్యంలో కేటీఆర్, హరీశ్‌రావు ఒకరికి మించి ఒకరు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వారి మధ్య ఉన్న ఆధిపత్య పోరును కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు’’ అని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు.

తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ । గురువారం 3 సెప్టెంబర్ 2026



# వారసత్వ భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**పెండింగ్‌లో ఉన్న పౌతీ విరాసత్ దరఖాస్తులను పరిష్కరించాలి**

**పీఓపీ జాబితా నుంచి రైతుల భూములను తొలగించాలి**

**చిన్న సవరణలకు కలెక్టరేట్ చుట్టూ తిరిగే పరిస్థితి తొలగించాలి: సీపీఎం**



**తొలివెలుగు, వలిగొండ:** మండలంలో పెండింగ్‌లో ఉన్న పౌతీ విరాసత్ (వారసత్వ భూ బదలాయింపు) దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వలిగొండ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పల్లవికి సీపీఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. మృతి చెందిన రైతుల కుటుంబ సభ్యులకు చెందాల్సిన వారసత్వ భూ బదలాయింపులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా దరఖాస్తుల్లో కులం, జెండర్, వయస్సు, పేరు తదితర చిన్నచిన్న సవరణల కోసం రైతులు కలెక్టరేట్ చుట్టూ తిరగాల్సి వస్తోందని తెలిపారు. ఇలాంటి సవరణలను మండల స్థాయిలోనే పరిష్కరించేలా అధికారాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

**పీఓపీ ఆంక్షలతో రైతులకు ఇబ్బందులు :**

మండలంలో ఎలాంటి స్పష్టమైన కారణాలు లేకుండా 22ఏ, పీఓపీ జాబితాలో నమోదైన భూములను వెంటనే తొలగించాలని సీపీఎం నాయకులు కోరారు. ట్రిపుల్ ఆర్, కాలువలు, రహదారుల నిర్మాణాల్లో ఎకరం భూమి మాత్రమే కోల్పోయే సందర్భంలో మొత్తం సర్వే నంబర్‌లోని భూమిని పీఓపీ జాబితాలో చేర్చడం వల్ల రైతులు ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. భూసేకరణలో కోల్పోయే భూమికి మాత్రమే ఆంక్షలను పరిమితం చేసి, మిగిలిన భూములకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కూర శ్రీనివాస్, గర్దాసు నరసింహ, కొండూరు సత్తయ్య, చేగూరి నగేష్, కర్ణకంటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



# మల్లారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు: పైళ్ల శేఖర్‌రెడ్డి

**గుండెపోటుతో కన్నుమూసిన మాజీ పీఏసీఎస్ చైర్మన్**

**ఆసుపత్రిలో నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి**



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** మండలంలోని కనుముకుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త కోట మల్లారెడ్డి (59) బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. ఉదయం 9 గంటల సమయంలో అల్పాహారం తీసుకున్న వెంటనే ఆయనకు ఛాతీలో తీవ్రమైన నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఎల్బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

**మృతదేహానికి పైళ్ల శేఖర్‌రెడ్డి నివాళులు:**

విషయం తెలిసిన వెంటనే భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకుని మల్లారెడ్డి మృతదేహాన్ని సందర్శించి అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి మల్లారెడ్డి విశేష సేవలందించారని, రాజకీయ నాయకుడిగా, వ్యాపారవేత్తగా ప్రజాసే వలో ఆయన పాత్ర మరువలేనిదని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు కందాడి భూపాల్‌రెడ్డి, నాయకులు సామ రవీందర్‌రెడ్డి, రావుల శేఖర్‌రెడ్డి, నోముల మాధవరెడ్డి, బత్తుల శ్రీశైలం గౌడ్, అందెల హరీష్, బాతుక లింగస్వామి, గోడల ప్రభాకర్ తదితరులు పాల్గొని సంతాపం తెలిపారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈనెల 4న (శుక్రవారం) సొంత గ్రామం కనుముకులలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫామ్‌ల పంపిణీ

**పట్టణ పరిశుభ్రతలో కార్మికుల పాత్ర అభినందనీయం**

**కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట: చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్**

వేతనాలు సకాలంలో అందేలా ప్రత్యేక చర్యలు

**తొలివెలుగు, చిట్యాల:** చిట్యాల పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్ యూనిఫామ్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమైనవని అన్నారు. ఎండ, వానను లెక్కచేయకుండా పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతినెలా వేతనాలు సకాలంలో చెల్లించేలా ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు గీతా రమేష్ పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, కౌన్సిలర్లు ఏర్పుల పరమేష్, షేక్ షబానా అజీమ్, బొబ్బిలి సందీప్ రామ్‌రెడ్డి, జేరిపోతుల సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ ఫాతిమా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఏకేఎల్‌బీ మర్చంట్ కమిటీ అధ్యక్షుడిగా సంఘం చంద్రయ్య

**నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక.,. నూతన సభ్యులకు ఘన సన్మానం**



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** పోచంపల్లి పురపాలక కేంద్రంలోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్తక మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి బాలరాజు హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా సంఘం చంద్రయ్య, గౌరవ అధ్యక్షుడిగా భోగ విష్ణు, ప్రధాన కార్యదర్శిగా గుర్రం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా సుంకి భాస్కర్, సహాయ కార్యదర్శిగా ఈపూరి మార్కండేయ, కోశాధికారిగా భోగ మార్కండేయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపికైన నూతన బాధ్యులను అతిథులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. వర్తకుల సంక్షేమానికి నూతన కమిటీ నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏకేఎల్‌బీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కస్తూరి సుదర్శన్, టై అండ్ డై కార్యదర్శి ఈపూరి ముత్యాలు, ఉపాధ్యక్షుడు కుడికాల బాల్ నరసింహ, గుండు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# చేనేతల ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం

**శ్రీ మహమ్మాయి చేనేత కాలనీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**

**అధ్యక్షుడిగా పాలాది యాదగిరి.. నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం**

**చేనేత కాలనీల అభివృద్ధికి కృషి చేయాలి: అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్**



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** చేనేత కళాకారుల సమస్యల పరిష్కారానికి చేనేత కార్మికులంతా ఐక్యంగా ముందుకు సాగాలని అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ అన్నారు. భూదాన్‌పోచంపల్లి పురపాలక కేంద్రంలోని శ్రీ మహమ్మాయి చేనేత కాలనీ నూతన కమిటీ ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తడక రమేష్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ అధ్యక్షుడిగా పాలాది యాదగిరి, ఉపాధ్యక్షుడిగా పున్న జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా కుర్ర ఎల్లేష్, కోశాధికారిగా చెరుపల్లి అమర్నాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బాలిని విఘ్నేశ్వర్, భారత బాలరాజు, అంద వెంకటేశం, పొడుగు బాలరత్నం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తడక రమేష్ మాట్లాడుతూ... చేనేత రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత కాలనీల పూర్తిస్థాయి అభివృద్ధికి నూతన కమిటీ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం ప్రధాన కార్యదర్శి సురపల్లి శ్రీనివాస్, కోశాధికారి కోడి బాలరాజ్, డైరెక్టర్లు మహేశ్వరం నాగమణి, బాలాజీ జ్యోతి, మాజీ అధ్యక్షులు భోగ రాములు, కోడి బాల నరసింహ, గంజి కృష్ణ, వేముల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ

**మృతుడి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత**

**ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఫౌండేషన్**



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రానికి చెందిన బంటిగూడెం గొల్లెన ఎల్లయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పరామర్శించి, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కుటుంబానికి తమవంతు సహాయంగా బియ్యాన్ని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు పిండికూర మహేష్, రేగు సిద్ధులు, ఐరెని నవీన్, గొల్లెన స్వామి, బోధసు కనకయ్య, గోలనుకొండ బిక్షపతి, గుర్రం రూపేష్, కొత్త ఉమేష్, కర్రె కనకయ్య, గొల్లెన సురేష్, కాకల్లా మల్లేష్, గొల్లెన నరేష్, ప్రశాంత్, మహేష్, గొల్లెన ఐలయ్య, గొల్లెన సోములు, గొల్లెన నర్సింలు, మునిద్, శ్రీకాంత్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి 'జైశ్రీరామ్' ఫౌండేషన్ అండ

**మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం**

**188వ విడత సేవా కార్యక్రమంలో నగదు పంపిణీ**

**కష్టకాలంలో పేదలను ఆదుకోవడం అభినందనీయం: సర్పంచ్ కోయ మధు**




**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రానికి చెందిన గొల్లెన ఎల్లయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి 'జైశ్రీరామ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో బుధవారం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఫౌండేషన్ చేపడుతున్న 188వ సేవా కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ కోయ మధు చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోయ మధు మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఫౌండేషన్ సభ్యుల సేవలు అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడంలో సామాజిక సంస్థలు ముందుకు రావడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాండ్ల నర్సింగరావు, చెలమనపల్లి లక్ష్మణ్, దాచాపల్లి శ్రీనివాస్, దిడ్డి సత్తయ్య, బిర్రు సురేష్, సంగం మధు, గొల్లెన స్వామి, గొల్లెన రవి, గొల్లెన నరేష్, ఎండీ ఖాజా, కిష్టయ్య, కనకయ్యతో పాటు ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమికి ముస్తాబైన 'సాయి మందిరం'

**4న రాజాపేటలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు**

**ఆకట్టుకోనున్న చిన్నారి గోప గోపికల సామూహిక నృత్య ప్రదర్శన**

**విశేష పూజలు, అభిషేకాలు.. భక్తులకు తీర్థప్రసాద వితరణ**



**తొలివెలుగు, రాజాపేట:** వైష్ణవ సంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఈ నెల 4న శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రావణ బహుళ అష్టమిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ వైదిక నిర్వహణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. తిరుమల గ్రూప్స్ అధినేత, ఆలయ గౌరవ అధ్యక్షుడు నంగునూరి చంద్రశేఖర్ గుప్తా ఆధ్వర్యంలో, దాతలు పుల్లూరు ఉపేందర్ గుప్తా–సూర్యకళ దంపతుల సహకారంతో వేడుకలు నిర్వహించనున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు చిన్నారి గోప గోపికల సామూహిక నృత్య ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 7 గంటల నుంచి బాలకృష్ణునికి పంచామృత, ఫలరస అభిషేకాలు, నవనీత నివేదన, మంగళ నిరాజనం, హరినామ సంకీర్తన, డోలోత్సవం, పవళింపు సేవ, మహదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరగనున్నాయి.

**చిన్నారులకు ప్రత్యేక బహుమతులు:**

గోప–గోపికల వేషధారణలో వేడుకలకు హాజరయ్యే చిన్నారులకు దాత మంచాల భద్రయ్య–కవిత దంపతుల సహకారంతో ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ పరమాత్మ కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# సీసీఎల్‌ఏలో భూముల తారుమారుపై ఫిర్యాదు!

**అగ్రిమెంట్ చేసిన భూమి మరో వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారంటూ ఆరోపణ**

**కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విన్నపం**

**రైతులు తమ భూముల వివరాలను పరిశీలించుకోవాలి: బింగి శ్రీనివాస్**

**తొలివెలుగు, రాజాపేట:** సీసీఎల్ఏలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ రాజాపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన బింగి శ్రీనివాస్ బుధవారం రాజాపేట తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. చల్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 329లో పొద్దుటూరి జ్ఞానేశ్వర్‌కు చెందిన నాలుగు ఎకరాల తొమ్మిది గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు తాను కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. అయితే, ఆ భూమి ఇతరులకు రిజిస్ట్రేషన్ కాకుండా న్యాయవాది ద్వారా నోటీసులు ఇచ్చినట్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయం ద్వారా ఆన్‌లైన్‌లో బ్లాక్ చేయించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ, రెవెన్యూ కార్యాలయంతో తనకు ఎలాంటి సంబంధం లేకుండా నేరుగా సీసీఎల్ఏలో తాను అగ్రిమెంట్ చేసుకున్న భూమిని బింగి కరుణాకర్ అనే వ్యక్తి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు శ్రీనివాస్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో తనకు అగ్రిమెంట్ అయిన భూమితో పాటు మండలంలోని మరికొన్ని భూముల వివరాలు కూడా సీసీఎల్ఏలో తారుమారై ఉండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

**రైతులు అప్రమత్తంగా ఉండాలి:**

మండలంలోని రైతులు తమ వ్యవసాయ భూముల వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని శ్రీనివాస్ సూచించారు. తమ భూములు సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని సంబంధిత రికార్డుల్లో పరిశీలించుకుని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రైతుల భూములను అక్రమంగా కాజేస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపి, తప్పు చేసినట్లు తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

**వలిగొండలో ఘనంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి**

**చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నేతల నివాళులు**

**తొలివెలుగు, వలిగొండ :** స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు వైఎస్సార్ ముఖ్యమంత్రిగా అందించిన సేవలను, పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేపట్టిన కార్యక్రమాలను స్మరించుకున్నారు. ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు బత్తిని సహదేవ్‌గౌడ్, పోలేపాక జనాకిరాములు, నాయకులు బత్తిని లింగయ్యగౌడ్, పాశం సత్తిరెడ్డి, పబ్బు సురేందర్‌గౌడ్, చెరుకు శివయ్యగౌడ్, కుమ్మరి రాములు, చిలుగురి సత్తిరెడ్డి, కాసుల వెంకన్నగౌడ్, మైసోళ్ల యాదగిరి, రచమల్ల తిరుపతయ్య, మరగొని నరసింహ, ఎండీ కుర్షిద్, బత్తిని వరుణ్‌గౌడ్, అధిముల సోమేశ్, దండ మల్లికార్జున్, కీర్తి వెంకటేష్, కూర వెంకన్నతో పాటు కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఆసక్తి ఉన్న రంగంలో పట్టుదలతో రాణించాలి: కలెక్టర్ అనురాగ్ జయంతి

**విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి**

**పదో తరగతి పరీక్షలపై అనవసర ఒత్తిడి వద్దు.. కలెక్టర్ సూచన**

**విద్యార్థులకు మెరుగైన విద్యా, మౌలిక వసతులు కల్పించాలి**



**తొలివెలుగు, భువనగిరి:** విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకుని, పట్టుదలతో కృషి చేస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం భువనగిరి మండలం అనంతారం గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, భోజనం, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, పరీక్షలకు సిద్ధమవుతున్న విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి క్రీడలు, ఐటీ, సాంకేతికత, కళలు తదితర రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు.

**పరీక్షలపై ఒత్తిడి వద్దు:**

పదో తరగతి పరీక్షలను జీవితంలో ఒక ముఖ్యమైన అడుగుగా మాత్రమే భావించాలని, పరీక్షల్లో ఆశించిన ఫలితాలు రాకపోయినా జీవితం ఆగిపోదని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. అనవసరమైన ఒత్తిడికి గురికాకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అన్నారు.విద్యార్థులు భవిష్యత్తులో వివిధ పోటీ పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్, ఇతర విద్యా సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాల నిర్వహణ, విద్యాబోధన, విద్యార్థుల విద్యా ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు.

**పరిశుభ్రతపై నిర్లక్ష్యం వద్దు:**



పాఠశాలలోని మరుగుదొడ్లు, తరగతి గదులు, కిచెన్, స్టోర్ రూమ్‌తో పాటు ఇతర మౌలిక వసతులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, సిబ్బందిపై ఉందన్నారు. మరుగుదొడ్లను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచాలని, తలుపులు తదితర వసతుల్లో లోపాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కిచెన్‌లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉన్న ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీలను తనిఖీ చేశారు. గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలు విద్యార్థులకు అందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి మాధవి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న జెల్ల, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే కుంభం

**మల్లేపల్లిలో రూ.60 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం**

**డ్రైనేజీ, సీసీ రోడ్డు ప్రారంభం.. మహిళా శక్తి భవనానికి శంకుస్థాపన**

**గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం**



**తొలివెలుగు, వలిగొండ :** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. వలిగొండ మండలం మల్లేపల్లి గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన డ్రైనేజీ, రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న మహిళా శక్తి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో మొత్తం రూ.60 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

**మౌలిక వసతుల కల్పనే లక్ష్యం:**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ గరిసె రవి, సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని సహదేవ్‌గౌడ్, ఉప సర్పంచ్ మలుగ మాధవి వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకిరాములు, యూత్ కాంగ్రెస్ నాయకుడు బత్తిని వరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# హామీలు అమలు చేయాలి.. కాంగ్రెస్ బాకీ కార్డుతో బీఆర్ఎస్ నిరసన

**ఆరు గ్యారెంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలి**

**వివిధ వర్గాలకు ప్రభుత్వం బకాయి పడిందంటూ భారీ ఫ్లెక్సీల ప్రదర్శన**

**హామీలు అమలు చేసే వరకు ప్రజల తరఫున పోరాటం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి**



**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'కాంగ్రెస్ బాకీ కార్డు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియం నుంచి కొత్తపేట వరకు బుధవారం భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ వర్గాల ప్రజలకు ప్రభుత్వం ఎంత బకాయి పడిందో వివరిస్తూ భారీ ఫ్లెక్సీలను ప్రదర్శించారు.

బీఆర్ఎస్ నాయకుల ఆరోపణల ప్రకారం.. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున 33 నెలలకు రూ.82,500, వృద్ధులు, బీడీ కార్మికులకు నెలకు రూ.4,000 పెన్షన్ చొప్పున రూ.66,000, దివ్యాంగులకు నెలకు రూ.6,000 చొప్పున రూ.66,000 బకాయి ఉందని పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఆడబిడ్డల వివాహాలకు తులం బంగారం అందిస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన స్కూటీలను అందించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద కళాశాల విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.12 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. నాలుగు ఎకరాల రైతుకు రైతుభరోసా కింద రూ.1.02 లక్షలు, రుణమాఫీ కింద రూ.2 లక్షలు బకాయి ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. వరి పంటకు ప్రకటించిన రూ.500 బోనస్ కింద ఎకరాకు రూ.12,500, ప్రతి పంటకు రూ.75 వేల వరకు బకాయి ఉందని ఆరోపించారు.రైతు కూలీలకు ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలతో పాటు నిరుద్యోగ భృతి కింద 33 నెలలకు రూ.1.32 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యా భరోసా కార్డు కింద విద్యార్థులకు రూ.5 లక్షలు, ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాల్సి ఉందని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.


**ప్రజలు నమ్మే పరిస్థితి లేదు: సుధీర్‌రెడ్డి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మహిళలు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి: అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు





**పాఠశాలల్లో పరిశుభ్రత, సురక్షిత వాతావరణంపై ప్రత్యేక దృష్టి**


**ఫారం పాండ్ పనులు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి**

**విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలి**

**తొలివెలుగు, గుండాల :** పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. బుధవారం గుండాల మండలం రామారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, హాజరు, తాగునీటి వసతి, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి వారి చదువుపై వివరాలు తెలుసుకు న్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చిన్నారులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ప్రత్యేక ప్రణాళికతో బోధన అందించాలని, హాజరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.

**ఫారం పాండ్ పనుల్లో నాణ్యత తప్పనిసరి:**

అనంతరం రామారం గ్రామంలో నిర్మిస్తున్న ఫారం పాండ్ పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఫారం పాండ్‌లు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని సూచించారు. వ్యవసాయానికి నీటి లభ్యత మెరుగుపడే విధంగా ప్రభుత్వ మార్గదర్శకాలు, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి, నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఎంపీడీవో, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# విద్యార్థినుల మృతి కేసులో ట్విస్టులు.. వార్డెన్‌పైనే అనుమానాలు!

**ఆటో డ్రైవర్‌తో సంబంధం చూశారనే కక్ష సాధింపా?**

**ఫేక్ సూసైడ్ లెటర్ సృష్టించారంటూ తల్లిదండ్రుల ఆరోపణ**

**తమ పిల్లలది ఆత్మహత్య కాదు.. పక్కా ప్రణాళికతో హత్య చేశారంటూ కుటుంబ సభ్యుల అనుమానం**



**తొలివెలుగు, భువనగిరి :** భువనగిరి ఎస్సీ బాలికల వసతిగృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు భవ్య, వైష్ణవి మృతి ఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది. ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడ్డారనే ఘటనపై విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో.. వారి మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాలికల మృతికి వసతిగృహ వార్డెన్ శైలజ కారణమంటూ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**వార్డెన్‌పై తీవ్ర ఆరోపణలు:**

వార్డెన్ శైలజకు ఓ ఆటో డ్రైవర్‌తో సంబంధం ఉందని, ఆ విషయం భవ్య, వైష్ణవిలకు తెలిసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం బయటకు వస్తుందనే భయంతోనే బాలికలను వేధించినట్లు వారు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

**సూసైడ్ లేఖపై అనుమానాలు:**

ఘటన అనంతరం లభించినట్లు చెబుతున్న సూసైడ్ లేఖలో "మా మేడమ్ శైలజ చాలా మంచిది.. ఆమెను ఒక్క మాట కూడా అనకండి" అనే విధంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ విషయమే తమకు అనేక అనుమానాలను కలిగిస్తోందని వారు అంటున్నారు. లేఖ నిజంగా విద్యార్థినులే రాశారా? లేక మరెవరైనా సృష్టించారా? అనే కోణంలోనూ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

**'హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు':**

తమ పిల్లలు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి లేదని, పక్కా ప్రణాళికతో వారిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారనే అనుమానం ఉందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసుల విచారణను తప్పుదోవ పట్టించేందుకే నకిలీ సూసైడ్ లెటర్ సృష్టించి ఉండవచ్చని వారు మండిపడుతున్నారు.

**సమగ్ర దర్యాప్తుకు డిమాండ్:**

ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరిపి, బాలికల మృతికి అసలు కారణాలను వెలుగులోకి తీసుకురావాలని బాధిత కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సూసైడ్ లేఖ ప్రామాణికత, బాలికల మృతికి ముందు జరిగిన పరిణామాలు, వసతిగృహంలో వారి పరిస్థితులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన తప్పనిసరి





**– శ్రీ జయ ల్యాబ్స్ సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన**

**– హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై పోలీసుల సూచనలు**

**– మద్యం సేవించి, అతివేగంగా వాహనాలు నడపొద్దు: ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్**

**తొలివెలుగు, చౌటుప్పల్:** మల్కాపూర్ పరిధిలోని శ్రీ జయ ల్యాబ్స్ కంపెనీలో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ సిబ్బందికి రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులు వివరించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని తెలిపారు.
అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ పోలీస్ ఎస్ఐ కె. యాదగిరి, సిబ్బందితో పాటు శ్రీ జయ ల్యాబ్స్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్యమే కుటుంబానికి బలం

**– తంగడపల్లి పీహెచ్‌సీలో స్వయం సహాయక మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు**

**– క్యాంప్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్**



**తొలివెలుగు, చౌటుప్పల్ :** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుందని, వారు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. బుధవారం చౌటుప్పల్ మండలం తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు నిర్వహించిన ఉచిత మెడికల్ టెస్టులు, హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్‌ను ఆమె ప్రారంభించారు.

**ప్రధాన ముఖ్యాంశాలు:**

వైద్య పరీక్షలు: సుమారు 50 మంది మహిళలకు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, బరువు, బీఎమ్ఐ వంటి సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, వైద్య సలహాలు అందించారు.

**ముందస్తు గుర్తింపు:**

రక్తహీనత, థైరాయిడ్, మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందాలని వైద్యులు అవగాహన కల్పించారు.

**అన్ని సంఘాలకూ విస్తరణ:**

చౌటుప్పల్ మండలంలోని పొదుపు సంఘాల మహిళలందరికీ విడతల వారీగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటం రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వీణ, ఏపీఓ యాదయ్య, ఆర్ఓ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ రవీందర్, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# యాదగిరిగుట్టలో వరుస దొంగతనాలు.. భక్తుల్లో ఆందోళన

**– పార్క్ చేసిన కార్ల అద్దాలు పగులగొట్టి చోరీలు**

**– సత్యనారాయణ వ్రతం అనంతరం వచ్చేసరికి కారులోని వస్తువులు మాయం**

**– భక్తుల వాహనాలకు భద్రత కల్పించాలంటూ పోలీసులకు విజ్ఞప్తి**

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ పరిసరాల్లో వరుసగా జరుగుతున్న దొంగతనాల ఘటనలు భక్తుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. కొండపై పార్కింగ్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని వ్యక్తులు కార్ల అద్దాలు పగులగొట్టి నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులను అపహరిస్తున్నట్లు భక్తులు చెబుతున్నారు. తాజాగా సత్యనారాయణ వ్రతం కోసం ఆలయానికి వచ్చిన నూతన దంపతులు, వారి కుటుంబ సభ్యులు తమ వాహనాన్ని పార్క్ చేసి వ్రతానికి వెళ్లి తిరిగి వచ్చే సరికి కారులోని విలువైన వస్తువులు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైనట్లు సమాచారం. కారులో ఉంచిన బంగారం, నగదు, ఇతర వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు పేర్కొంటున్నారు.

**భద్రతపై భక్తుల ఆందోళన:**

ఆలయానికి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుండటంతో వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని భక్తులు కోరుతున్నారు. వాహనాల్లో విలువైన వస్తువులు ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కొండపైన, కొండకింద పార్కింగ్ ప్రాంతాల్లో పోలీసుల పహారా పెంచడంతో పాటు సీసీ కెమెరాల నిఘాను విస్తరించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా? పార్కింగ్ ప్రాంతాల్లో తగినంత నిఘా ఉందా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.వరుస ఘటనల నేపథ్యంలో దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఆలయ పరిసరాల్లో భక్తులు, వారి వాహనాలకు మెరుగైన భద్రత కల్పించాలని భక్తులు కోరుతున్నారు. ఘటనలపై పోలీసులు దర్యాప్తు చేసి పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.



# నిడమనూరులో ఉచిత వైద్య శిబిరం

**వైరల్ జ్వరాల నివారణకు ముందస్తు చర్యలు**

**మోడల్ స్కూల్, బస్టాండ్ వద్ద రెండు కేంద్రాల్లో నిర్వహణ**

**జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలి**

**తొలివెలుగు, నిడమనూరు:** నిడమనూరు గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామంలో జ్వరాలు, వైరల్ ఫీవర్లు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గౌరవ సర్పంచ్ శేషరాజు సంధ్య శ్రీనివాస్ సూచన మేరకు, వైద్యుల బృందం సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మోడల్ స్కూల్ వద్ద, బస్టాండ్ వద్ద రెండు ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. జ్వరం, జ్వరం లక్షణాలతో బాధపడుతున్న వారు, ఇప్పటికే జ్వరంతో ఉన్నవారు తప్పనిసరిగా శిబిరానికి హాజరై వైద్యుల సలహాలు, అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని గ్రామపంచాయతీ సూచించింది. అదేవిధంగా ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు కూడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని వైద్యులను సంప్రదించాలని కోరింది. గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేందుకు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామపంచాయతీ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# భారీగా రేషన్ బియ్యం పట్టివేత

**మాదవరాయినిగూడెంలో 17 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం**

**340 బస్తాలతో ఇద్దరు అదుపులో.. సివిల్ సప్లై అధికారులకు సమాచారం**

**కీలక సూత్రధారి కోసం పోలీసుల దర్యాప్తు**



**తొలివెలుగు, హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాదవరాయినిగూడెంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన భారీ మొత్తంలో రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పలు రేషన్ దుకాణాల నుంచి సేకరించినట్లు అనుమానిస్తున్న 17 టన్నుల (340 బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో మర్రిగూడెం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ షేక్ పాషా, మఠంపల్లి మండలం రామచంద్రపురం తండాకు చెందిన బాబు నాయక్‌లను అదుపులోకి తీసుకున్నారు. బియ్యాన్ని కూడా పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ఘటనపై సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించారు.

**కీలక సూత్రధారి కోసం దర్యాప్తు:**

రేషన్ బియ్యం అక్రమ రవాణా వెనుక ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా తంగెడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కీలక సూత్రధారిగా ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అతని కోసం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ రవాణా వ్యవహారంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? బియ్యాన్ని ఎక్కడికి తరలించేందుకు సిద్ధం చేశారు? తదితర అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

# హామీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**– 1000 రోజులు దాటిన నేపథ్యంలో ప్రభుత్వానికి బీఎస్పీ నేత డిమాండ్**

**– హామీల అమలు స్థితిని ప్రజలకు వెల్లడించాలని తగరం సుభాష్ చంద్రబోస్ విజ్ఞప్తి**



**తొలివెలుగు, మునుగోడు / చౌటుప్పల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు దాటిన సందర్భంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు స్థితిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బీఎస్పీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు తగరం సుభాష్ చంద్రబోస్ కోరారు.ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు రైతు భరోసా, మహిళలకు ఆర్థిక సహాయం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కొన్ని హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆయన అభిప్రాయపడ్డారు.

**అమలు వివరాలు వెల్లడించాలి:**

ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేసిన హామీలు, పెండింగ్‌లో ఉన్న అంశాల వివరాలను ప్రజల ముందుంచాలని సుభాష్ చంద్రబోస్ కోరారు. హామీల అమలుకు సంబంధించి ప్రభుత్వం విజయాలు, పురోగతితో పాటు ఇంకా చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని సూచించారు.

**పెండింగ్ హామీలకు గడువు ప్రకటించాలని విజ్ఞప్తి:**

ఇంకా అమలు చేయాల్సిన హామీలను ఎప్పటిలోగా పూర్తి చేయనున్నారో ప్రభుత్వం వెల్లడించాలని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వడం ద్వారా ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయవచ్చని పేర్కొన్నారు. హామీల అమలుపై ప్రభుత్వం సమగ్ర సమాచారాన్ని ప్రజలకు అందించాలని తగరం సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు.

# ముంపు గ్రామాల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు లేదు

మక్తల్ : నియోజకవర్గంలో దశాబ్దాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని, పదవులు శాశ్వతం కాదు.. ప్రజల కోసం చేసిన పనులే శాశ్వతం అంటూ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. రెండు వేల కోట్లతో అభివృద్ధి పనులు, నిర్మాణం జరుగుతున్న ప్రాజెక్టుల కింద ముంపు గ్రామాల సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపుతున్న మంత్రి వాకిటి శ్రీహరిపై చిట్టెం వారసుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడే నైతిక హక్కు లేదని ముంపుకు గురైన గ్రామాల సర్పంచులు, ప్రజలు, చిట్టెం వారసుని మాజీ సర్పంచులు ప్రశ్నిస్తున్నారు. జూరాల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో భూములు, ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన ముంపు గ్రామాలైన ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లి, కిష్టంపల్లి, గడ్డంపల్లి, ముష్టిపల్లి, ప్రియదర్శిని, అనుగొండ, అంకెన్‌పల్లి, దాధన్‌పల్లి గ్రామాల ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవించామని, ముంపు గ్రామాల ప్రజల దశాబ్దాల బాధలను అప్పటి ఎమ్మెల్యేగా దృష్టికి తీసుకెళ్లిన ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు ముంపు గ్రామాల ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం ఎందుకు చూపలేకపోయారని బాధిత గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోని చిట్టెం వారసుడు ప్రతిపక్షంలోకి వచ్చాక రాజకీయ విమర్శలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ముంపు గ్రామాల బాధిత ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, వాకిటి శ్రీహరి ఇచ్చిన హామీల మేరకు అనుగొండ, అంకెన్‌పల్లి, దాధన్‌పల్లి మూడు గ్రామాలకు పునరావాసం కోసం సుమారుగా రూ.100 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసి శరవేగంగా పనులు జరుగుతున్నాయి. రెండున్నర ఏళ్లలో మంత్రి హయాంలో పునరావాస పనులను ప్రతిపక్ష నాయకులు, చిట్టెం వారసునికి అభివృద్ధిని ప్రత్యక్షంగా చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని బాధిత గ్రామాల సర్పంచులు అంటున్నారు. సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల కింద ముంపు గ్రామాలకు పునరావాసం అక్కరలేదు.. కొన్ని నిర్మాణ పనులు చేపడితే చాలని తెరాస రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పిన ఘనత చిట్టెం వారసుడికి చెల్లిందని బాధిత గ్రామాల ప్రజలు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న భూత్పూర్, నెరెడ్‌గొమ్ము గ్రామాల పునరావాసం, మూసేసిన ఫైల్‌ను ఓపెన్ చేయించి వారికి పునరావాసం, నష్టపరిహారం ఇప్పించేలా కృషి చేశారు. గ్రామాల పునరావాస పనులు కూడా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పదవులు శాశ్వతం కాదు.. ప్రజల కోసం చేసిన పనులే శాశ్వతం అంటూ పూర్తి అవుతా యని నిర్వాసిత గ్రామాల ప్రజలు అన్నారు. చిట్టెం వారసునితో దీనిపై బహిరంగంగా చర్చించేందుకు నిర్వాసిత గ్రామాల ప్రజలు సిద్ధంగా ఉన్నామని వారు అంటున్నారు.



## పవన్ కల్యాణ్ బర్త్‌డే వేడుకలు

**సందడి చేసిన సాయి దుర్గా తేజ్**

**తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు**

**కూకట్‌పల్లిలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జరిపిన అభిమానులు**

**ముఖ్య అతిథిగా హాజరైన హీరో సాయి దుర్గా తేజ్**

**చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు**



**కూకట్‌పల్లి:** జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రముఖ సినీ నటుడు, పవన్ మేనల్లుడు సాయి దుర్గా తేజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అభిమానులు, జనసేన కార్యకర్తల మధ్య ఆయన ఈ సంబరాల్లో పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని గోపాల్ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయి దుర్గా తేజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి చిన్నారులతో కలిసి ఆయన పుట్టినరోజు కేక్ కట్ చేశారు. అనంతరం పవన్ కల్యాణ్‌కు తన హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో అభిమానులు, జనసేన మద్దతుదారులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

అనంతరం, పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సాయి దుర్గా తేజ్ సందర్శించారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి, రక్తదానం వంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించినందుకు నిర్వాహకులను, వాలంటీర్లను అభినందించారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన వారిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమం కేవలం పవన్ కల్యాణ్‌పై అభిమానాన్ని చాటడమే కాకుండా, సామాజిక సేవ, సమాజ సంక్షేమాన్ని ప్రోత్సహించే ఒక మంచి అవకాశంగా నిలిచింది. పవన్ పుట్టినరోజును ఒక సేవా కార్యక్రమంగా జరపడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## కాంగ్రెస్‌లో కుమ్ములాటలు కొత్తేమీ కావు

**హద్దులు దాటితే అధిష్ఠానం చూసుకుంటుంది: రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**నేతల మధ్య భిన్నమైన అభిప్రాయాలు ఉంటాయని వ్యాఖ్య**

**కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్న కడియం కావ్య**




కాంగ్రెస్ అనేది ఒక విలక్షణమైన జాతీయ పార్టీ అని, పార్టీలో అభిప్రాయభేదాలు, అంతర్గత కొట్లాటలు ఉండటం సహజమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఒకరికొకరి మధ్య విభిన్నమైన అభిప్రాయాలు ఉంటాయని అన్నారు. చర్చలు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయని, అయితే ఆ చర్చలు లేదా వివాదాలు పరిమితులు దాటితే మాత్రం పార్టీ అధిష్ఠానం కచ్చితంగా జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే దాదాపు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ప్రభుత్వం అందిస్తున్న డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్లను కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే పరిమితం చేయకుండా, అర్హులైన నిరుపేదలందరికీ పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సంక్షేమ పాలన అందించారంటూ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామి రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్‌లతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేవీకి ఐఎన్ఎస్ 'సమర్థక్' నౌక అప్పగింత



**విశాఖపట్నం(సింధియా):** భారత నౌకాదళ అవసరాల నిమిత్తం నిర్మించిన ఐఎన్ఎస్ 'సమర్థక్' నౌకను ఎల్అండ్‌టీ సంస్థ బుధవారం నేవీ అధికారులకు అప్పగించింది. తమిళనాడులోని కట్టుపల్లి వద్ద ఉన్న ఎల్అండ్‌టీకి చెందిన వార్‌షిప్ డిజైన్ సంస్థలో ఈ నౌకను నిర్మించారు. అనంతరం నౌకకు వివిధ దశల్లో చేపట్టాల్సిన పరీక్షలను విజయవంతంగా పూర్తిచేశారు. బహుళ ప్రయోజనకారి అయిన ఈ నౌకను నిర్మించడం గర్వంగా ఉందని ఎల్అండ్‌టీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎ.టి.రామ్‌చందని వెల్లడించారు.

# సరికొత్త వ్యూహంతో భారీ దాడులకు సిద్ధం

**అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్**

**అమెరికాతో యుద్ధంలో కొత్త వ్యూహాన్ని అమలు చేస్తామని హెచ్చరించిన ఇరాన్**

**సమీప దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు చేసినట్లు వెల్లడించిన ఐఆర్‌జీసీ**

**ఇరాన్ ప్రతిదాడులు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరిస్తున్న ట్రంప్**



**న్యూయార్క్:** అమెరికా– ఇరాన్ మధ్య 6 నెలలుగా కొనసాగుతున్న ఘర్షణ మరోసారి తీవ్రరూపం దాల్చింది. ఇటీవల రెండు దేశాల మధ్య దాడులు, ప్రతి దాడులు తీవ్రతరం కావడంతో ఇరాన్ తాజాగా సంచలన ప్రకటన చేసింది. అమెరికాను దెబ్బతీసేందుకు తాము త్వరలోనే ఒక కొత్త వ్యూహాన్ని అమలు చేయబోతున్నామని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ హెచ్చరించారు. యుద్ధ రంగంలో, దౌత్యంలో అలాగే ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో ఇరాన్ అనుసరించబోయే సరికొత్త వ్యూహం అమెరికా పునాదుల్ని కదిలిస్తుందని ఆయన తాజాగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పష్టం చేశారు. ఇరాన్ త్వరలోనే తమ కొత్త వ్యూహాన్ని చూపిస్తుందని అన్నారు.

### అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు

తాజా ఉద్రిక్తతల మధ్య ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (IRGC) అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేసినట్లు ప్రకటించింది. జోర్డాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE), కువైట్, బహ్రెయిన్ సహా ఇరాక్‌లోని కుర్దిస్థాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులు జరిగినట్లు తెలిపింది. ఇరాన్‌పై అమెరికా చేపట్టిన సైనిక చర్యలకు ప్రతిస్పందనగానే ఈ దాడులు చేసినట్లు టెహ్రాన్ పేర్కొంది. అమెరికా దాడుల్లో సుమారు 18 మంది మరణించినట్లు ఇరాన్ తెలిపింది. ఇరాన్ బలగాలు జోర్డాన్, యూఏఈలోని అమెరికా సైనికులను ప్రధానంగా లక్ష్యంగా చేసుకున్నాయి. ఇరాక్‌లోని ఎర్బిల్‌లో అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసినట్లు ఇరాన్ సైనిక వర్గాలు వెల్లడించాయి. జోర్డాన్‌లోని అమెరికా మెరైన్ శిక్షణా శిబిరంపై కూడా దాడి చేసినట్లు ప్రకటించాయి.

### కువైట్, బహ్రెయిన్‌లో హై అలర్ట్

ఇరాన్ దాడుల నేపథ్యంలో బహ్రెయిన్, కువైట్‌లో వైమానిక దాడుల హెచ్చరిక సైరన్లు వినిపించాయి. కువైట్ అధికారుల ప్రకారం– ఇరాన్‌కు చెందిన డ్రోన్ ఒక రెసిడెన్షియల్ హౌస్‌లో మంటలకు కారణమైంది. ఇదే సమయంలో రెండు చమురు ట్యాంకర్లను కూడా ప్రొజెక్టైల్స్ తాకాయి. అయితే ఈ దాడులకు మాత్రం ఎవరు బాధ్యులన్నది వెంటనే తెలియలేదు. ఒక ట్యాంకర్ ఘటనలో ఇక్కడ ఇద్దరు ఫిలిప్పీన్స్ నావికులు మరణించినట్లు సౌదీ అరేబియా నేషనల్ షిప్పింగ్ సంస్థ తెలిపింది.

దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ నగరంలో పెళ్లి వేడుక జరుగుతున్న ప్రాంతంపై జరిగిన దాడిని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడికి అమెరికానే కారణమని ఇరాన్ విదేశాంగ శాఖ ఆరోపించింది. దీనిని యుద్ధనేరంగా అభివర్ణించింది. ఇరాన్ రెడ్ క్రెసెంట్ ప్రకారం– ఈ ఘటనలో ఓ చిన్నారితో సహా నలుగురు మరణించారు. మరో 50 మందికిపైగా గాయపడ్డారు. పెళ్లి వేడుక జరిగిన ప్రాంతంలో ధ్వంసమైన దృశ్యాలను ఇరాన్ ప్రభుత్వానికి చెందిన సంస్థ ఒకటి ప్రసారం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి ఈ దాడిని అమెరికా వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నంగా విమర్శించారు. అయితే పెళ్లి వేదికపై జరిగిన దాడిపై అమెరికా సైన్యం నేరుగా స్పందించలేదు. యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి టిమ్ హాకిన్స్ మాత్రం అమెరికా సైన్యం పౌరులను ఎన్నడూ లక్ష్యంగా చేసుకోదని స్పష్టం చేశారు.

ప్రస్తుతం అమెరికా– ఇరాన్ యుద్ధంలో హార్ముజ్ జలసంధి కీలకంగా మారింది. ఇరాన్ ఈ ప్రాంతంలో మైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించిందని, అమెరికా సిబ్బందిపై దాడులు చేసిందని వాషింగ్టన్ ఆరోపించింది. దీనికి ప్రతీకారంగానే ఆదివారం ఇరాన్‌ను టార్గెట్‌గా చేసుకొని దాడులు చేపట్టినట్లు అమెరికా పేర్కొంది. దీంతో ఇరు దేశాల మధ్య వరుస దాడులు, ప్రతిదాడులు మొదలయ్యాయి.

### ట్రంప్ వార్నింగ్– పెజెష్కియాన్ మాత్రం దౌత్య పరిష్కారానికి ఓకే!

ఇరాన్ మరిన్ని ప్రతిదాడులకు పాల్పడితే అమెరికా మరింత భారీ స్థాయిలో ప్రతీకారం తీర్చుకుంటుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ మళ్లీ దాడులు చేస్తే– ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌లో చాలా తక్కువే మిగులుతుంది అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ మాత్రం దౌత్య పరిష్కారానికి అవకాశం ఉన్నట్లు సంకేతాలు ఇచ్చారు. ఘర్షణను ముగించేందుకు అమెరికా దౌత్యపరమైన ఒప్పందానికి ముందుకొస్తే ఇరాన్ కూడా దానికి స్పందిస్తుందని తెలిపారు. దీంతో ఒకవైపు పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతుండగా, మరోవైపు దౌత్య చర్చల ద్వారా 6 నెలలుగా కొనసాగుతున్న ఇరాన్– అమెరికా ఘర్షణకు ముగింపు పలికే అవకాశం ఇంకా ఉందా అన్నది ఆసక్తికరంగా మారింది.

## రష్యా గగనతలంలో ఎవరూ ప్రయాణించొద్దు

# డ్రోన్ దాడులు చేస్తాం

**ఉక్రెయిన్ అధ్యక్షుడి హెచ్చరిక**

**మాస్కో దాడులకు ప్రతిస్పందనగా రష్యా సైనిక లక్ష్యాలపై దాడులు చేయనున్నట్లు జెలెన్‌స్కీ ప్రకటన**



**కీవ్:** రష్యా గగనతలాన్ని ఉపయోగించుకుంటున్న విమానయాన సంస్థలు, ఇతర ఆపరేటర్లకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక హెచ్చరికలు జారీ చేశారు. రష్యాపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులు చేస్తామని, ఎవరూ ఆ ప్రాంతంలో ప్రయాణించకూడదని సూచించారు. ముఖ్యంగా రష్యాలోని మాస్కో, సెయింట్ పీటర్స్‌బర్గ్ వంటి ప్రధాన నగరాలకు విమానాలు నడుపుతున్న సంస్థలు ఈ హెచ్చరికలను గమనించాలని పేర్కొన్నారు. మంగళవారం చేసిన ప్రసంగంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు.

ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన దాడులకు ప్రతిస్పందనగా క్రెమ్లిన్ సైనిక లక్ష్యాలపై విరుచుకుపడుతామని జెలెన్‌స్కీ ప్రకటించారు. దాడుల నేపథ్యంలో రష్యా తమ గగనతలాన్ని మూసివేసే అవకాశం ఉందని, కాబట్టి ఆ ప్రాంతం ఇకపై పౌర విమానయానానికి ఏమాత్రం సురక్షితం కాదని స్పష్టం చేశారు. అదే సమయంలో, పౌర విమానయానానికి ముప్పు కలిగించే పనేదీ తాము చేయబోమని చెప్పారు. రష్యా గగనతలంలోని ప్రమాదాల గురించి, అంతర్జాతీయ సంస్థలకు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పూర్తి సమాచారాన్ని అందిస్తుందని తెలిపారు. రష్యా తమపై దాడులను కొనసాగిస్తున్నందున వాటిని అడ్డుకునేందుకే ఈ చర్యలు తీసుకోవాల్సి వస్తోందన్నారు. రష్యా ప్రారంభించిన యుద్ధమే ఇప్పుడు దాని గగనతలాన్ని ప్రభావితం చేస్తోందని పేర్కొన్నారు.

**దౌత్యపరమైన పరిష్కారానికి ఉక్రెయిన్ కట్టుబడి ఉంది**

ఇదిలా ఉండగా, దౌత్యపరమైన పరిష్కారానికి ఉక్రెయిన్ కట్టుబడి ఉందని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. "ఆగస్టు 25, 26, 27 తేదీల్లో మాస్కో, సెయింట్ పీటర్స్‌బర్గ్‌పై దాడులు నిలిపివేయాలని అమెరికా కోరినప్పుడు ఆ విరామాన్ని పాటించాం. శాంతి దిశగా వేసే ప్రతి అడుగు, యుద్ధాన్ని నిరోధించే ప్రతి అంశానికి మేం మద్దతు ఇస్తాం" అని జెలెన్‌స్కీ చెప్పారు.

**ఉక్రెయిన్‌పై దాడులను మరింత తీవ్రతరం చేస్తాం**

మరోవైపు, జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా స్పందించారు. పౌర విమానయాన భద్రతపై ఉక్రెయిన్ చేసిన హెచ్చరికను స్టేట్ టెర్రరిజంగా అభివర్ణించారు. చర్చలకు సంబంధించి జెలెన్‌స్కీ చేసిన పిలుపును పుతిన్ తిరస్కరించారు. అదే సమయంలో ఉక్రెయిన్‌పై దాడులను మరింత తీవ్రతరం చేయనున్నట్లు ప్రకటించారు. ఉక్రెయిన్‌లోని విద్యుత్, ఇంధన కేంద్రాలపై భారీ దాడులు చేసేందుకు సిద్ధం కావాలని తన సైన్యాన్ని ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ దాడులు ఉక్రెయిన్ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రభావం చూపుతాయని తెలిపారు. అనంతరం ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. బిష్కెక్‌లో షాంఘై సహకార సంస్థ సదస్సు అనంతరం పుతిన్ మీడియాతో మాట్లాడారు.

రష్యాలోని కీలక స్థావరాలపై ఉక్రెయిన్ ఇటీవల జరిపిన దాడులకు ప్రతీకారంగానే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు పుతిన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో రష్యా దళాలు తమ దాడుల వేగాన్ని పెంచాయని తెలిపారు. దాడుల తీవ్రతకు నిదర్శనంగా కేవలం ఆగస్టు నెలలోనే డొనెట్స్క్ ప్రాంతంలో ఏకంగా 270 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని, 15 నివాస ప్రాంతాలను రష్యా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుందని వివరించారు. మరోవైపు, యుద్ధానికి దౌత్యపరమైన పరిష్కారం కోసం అమెరికా ప్రతినిధులతో జరుగుతున్న సంప్రదింపుల పైనా పుతిన్ స్పందించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సన్నిహితులుగా భావించే వారితో కలిసి పనిచేసేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అమెరికా సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ పర్యటనపై అడగ్గా, ఇరు దేశాల నిఘా సంస్థల అధిపతుల మధ్య సంప్రదింపులు జరుగుతున్నాయని పుతిన్ అంగీకరించారు. ప్రస్తుతం చర్చలు కొంతమేర నిలిచిపోయాయని చెప్పారు.

## పదవీ విరమణకు ముందే... స్థలం అమ్ముకోడానికి

# అనుమతిస్తే ఏం ప్రయోజనం?



**న్యూఢిల్లీ:** పదవీ విరమణ తర్వాత నీడ కల్పించేందుకు ఉద్యోగులకు ప్రభుత్వం రాయితీ ధరల్లో ఇచ్చే ఇళ్ల స్థలాలను పదవీ విరమణ లోపే అమ్ముకోవడానికి అవకాశమిస్తే ఆ పథకం అమలుచేసి ఏం ప్రయోజనమని సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. హైదరాబాద్‌లోని సచివాలయంలో పనిచేసే ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజేంద్రనగర్ మండలం నెక్‌నామ్‌పూర్‌లో 55 ఎకరాలు, శామీర్‌పేట మండలం జవహర్‌నగర్‌లో 100 ఎకరాలు కేటాయిస్తూ 2010 జూన్ 14న జారీచేసిన జీవో నం.509, 510లను సవాల్ చేస్తూ మానెక్ ఒమిమ్ దేబరా అనే వ్యక్తి దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా బుధవారం జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ప్రశ్నించింది.

''ఉద్యోగులకు కేటాయించిన భూమి ఏ పరిస్థితిలో ఉంది.. లబ్ధిదారులు స్థలాలను అధీనంలోకి తీసుకున్నారా.. నిర్మాణాలు చేపట్టారా..'' అని జస్టిస్ పర్దీవాలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ బదులిస్తూ ''ఉద్యోగుల స్థాయినిబట్టి 100, 150, 163 గజాలు చొప్పున ఇచ్చారు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులుగా ఉంటే ఒకరికి మాత్రమే కేటాయించారు. అప్పటికే సొంత ఇల్లు, స్థలం ఉన్నవారికి కేటాయింపులు చేయలేదు. కేటాయించిన రెండేళ్లలో ఇళ్లు నిర్మించుకోవాలని షరతు విధించారు. ఐదేళ్లకు మించి సర్వీసు ఉన్నవారిని మాత్రమే సహకార సంఘంలో సభ్యులుగా చేర్చుకున్నారు'' అని పేర్కొన్నారు. కేటాయించిన భూమిని పదేళ్ల వరకూ బదిలీ చేయడానికి వీల్లేదని తెలిపారు.

జస్టిస్ పర్దీవాలా స్పందిస్తూ ''పదేళ్ల తర్వాత బదిలీ చేయాలనుకుంటే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలా? కేవలం పదేళ్ల గడువు ఎందుకు విధించారు? ఐదేళ్ల సర్వీసున్న ఉద్యోగులు కూడా ఈ భూమి పొందేందుకు అవకాశముంది. అంటే అప్పటికి ఉద్యోగి వయసు 25–30 ఏళ్లు ఉంటుంది. అంటే పదవీ విరమణ చేసేలోపే అమ్ముకోవడానికి అవకాశం ఉంటుంది. అలాంటప్పుడు ఈ విధానం ప్రయోజనం ఎలా నెరవేరుతుంది'' అని ప్రశ్నించారు. న్యాయవాది బదులిస్తూ పదవీ విరమణ వరకు ఉద్యోగులు దీన్ని అద్దెకు ఇచ్చుకోవచ్చని పేర్కొనగా ధర్మాసనం అందుకు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ కేటాయింపు నుంచి ఉద్యోగి ఎలాంటి ఇతరత్రా ప్రయోజనాలు పొందరాదని జస్టిస్ పర్దీవాలా పేర్కొన్నారు. ఆస్తి అన్యాక్రాంతానికి పదేళ్ల కాలపరిమితి విధించడం సంతృప్తికరంగా లేదన్నారు. ఒకవేళ ఆ కాలపరిమితిని 15, 20 ఏళ్లకు పెంచిన తర్వాత బదిలీ చేయాలన్నా ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకొనేలా షరతు ఉండాలని సూచించారు. రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్నవారికి కేటాయించినప్పుడు.. పదేళ్ల కాలపరిమితి విధించారంటే అర్థముందని అభిప్రాయపడ్డారు. న్యాయవాది స్పందిస్తూ ప్రస్తుతం స్థలం కేటాయింపు జరిగిన ఉద్యోగుల్లో ఏయే వయసులవారు ఉన్నారో జాబితాను కోర్టుకు అందిస్తామన్నారు. ఏ వయసువారికి ఎంత కాలపరిమితి విధిస్తే సముచితంగా ఉంటుందో ప్రభుత్వాన్ని అడిగి చెబుతామన్నారు. అందుకు అంగీకరించిన జస్టిస్ జేబీ పర్దీవాలా దీనిపై తాము చిన్న ఉత్తర్వు జారీ చేస్తామని, అందులో అడిగిన ప్రశ్నలన్నింటికీ 6 వారాల్లోపు సమాధానం చెప్పాలని సూచిస్తూ విచారణను వాయిదా వేశారు.

అంతకుముందు పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మోహన్‌రావు వాదనలు వినిపించడం ప్రారంభించినప్పుడు జస్టిస్ పర్దీవాలా జోక్యం చేసుకుంటూ ''రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్థలాలు కేటాయించడంలో తప్పేముంది? ఉచితంగా ఇచ్చారా? లేదంటే ఏదైనా ధరకు కేటాయించారా'' అని ప్రశ్నించారు. అందుకు ఆయన బదులిస్తూ రూ.3 వేల కోట్ల విలువైన భూమిని రూ.3 కోట్లకు కేటాయించినట్లు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇలాంటి కేటాయింపులు ఆర్టికల్ 14కి విరుద్ధమని 2024 నవంబరులో వీబీజే చెలికాని కేసులో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. ఈ భూముల కేటాయింపునకు ప్రాతిపదిక అయిన జీవో నం.243, 244లను సుప్రీంకోర్టు కొట్టేసిందని, అందులో ఏదైనా అభివృద్ధి జరిగిఉంటే దాన్ని చెరిపేసి పూర్వస్థితిని పునరుద్ధరించాలని కూడా చెప్పిందని పేర్కొన్నారు. పేదలు, అణగారిన వర్గాలను విస్మరించి ప్రభుత్వ ఉద్యోగులు సభ్యులుగా ఉన్న సొసైటీకి సబ్సిడీ ధరల్లో భూములు కేటాయించడం కుదరదని సుప్రీంకోర్టు ఆ తీర్పులో చెప్పిందని పేర్కొన్నారు.

జస్టిస్ వినోద్ చంద్రన్ స్పందిస్తూ ''న్యాయమూర్తులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులను ప్రత్యేక క్లాస్‌గా పరిగణించకూడదని చెప్పింది సరే.. ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరులకు కేటాయించే భూమి ఆర్టికల్ 14 పరిధిలో ఉంటే న్యాయబద్ధం కావొచ్చని అదే తీర్పులో చెప్పింది కదా'' అని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు 2024 నవంబరు 25న ఇచ్చిన తీర్పులో జీవో నం.243లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, అఖిల భారతస్థాయి అధికారులు, రాజ్యాంగ కోర్టుల న్యాయమూర్తులు, పాత్రికేయులకు చేసిన కేటాయింపులను మాత్రమే కొట్టేసింది తప్పితే ఉద్యోగులకు ఇచ్చిన స్థలాలను కొట్టేయలేదు కదా? అని ప్రశ్నించారు. న్యాయవాది స్పందిస్తూ అందులో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కూడా ఉన్నారని, ఈ స్థలాలను సచివాలయ ఉద్యోగులకు ఇచ్చారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

జస్టిస్ పర్దీవాలా స్పందిస్తూ ''సెక్రటేరియట్‌లో మరుగుదొడ్లను శుభ్రంచేసే ఉద్యోగులు కూడా ఉంటారు. వారిని ఏ క్లాస్ ఉద్యోగులుగా పిలుస్తారు'' అని ప్రశ్నించారు. న్యాయవాది స్పందిస్తూ వారిని క్లాస్4 ఉద్యోగులుగా పిలుస్తారని పేర్కొంటూ బయట ప్రైవేటు దుకాణాల్లో పనిచేసేవారు, ఆటోడ్రైవర్లు, ప్రైవేటు ఉద్యోగులు వీరికంటే అణగారిన వర్గాలని, వారిని కాదని ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. జస్టిస్ వినోద్ చంద్రన్ స్పందిస్తూ ''వారుకూడా ఒక సహకార సంఘం ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం నుంచి ఇలాంటి ప్రయోజనాలు అడగొచ్చు. అలా అడగకుండా ఎవరూ అడ్డుకోలేరు'' అని పేర్కొన్నారు. ఇలాంటి విషయాల్లో ప్రాక్టికల్‌గా ఆలోచించాలని వ్యాఖ్యానించారు.

# బుమ్రా.. హార్దిక్‌పై ఫోకస్

## నేడు ముంబైలో బీసీసీఐ కీలక సమావేశం
## 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికపై సమీక్ష
## రోహిత్, కోహ్లీ, జడేజాల భవిష్యత్తుపైనా చర్చ

**న్యూఢిల్లీ:** కీలకమైన న్యూజిలాండ్ పర్యటనతోపాటు వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని భారత క్రికెట్ జట్టులో గాయపడిన ఆటగాళ్ల లభ్యత, ఫిట్‌నెస్, గాయాల నిర్వహణపై బీసీసీఐ గురువారం ముంబైలో సమీక్ష నిర్వహించనుంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్



సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తోపాటు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది. సీవోఈలో పునరావాసం పొందుతున్న కేంద్ర కాంట్రాక్ట్ ఆటగాళ్ల ఫిట్‌నెస్, తిరిగి పోటీల్లోకి వచ్చే సమయంపై అగార్కర్, గంభీర్ స్పష్టమైన వివరాలు కోరనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా, ఆకాశ్ దీప్ వంటి కీలక ఆటగాళ్ల అందుబాటుపై చర్చ జరగనుంది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ దృష్ట్యా హార్దిక్ పాండ్యా జట్టుకు అత్యంత కీలకమని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. 50 ఓవర్ల క్రికెట్‌కు అతడిని ఎంపిక చేయాలంటే 10 ఓవర్లు బౌలింగ్ చేసే స్థాయిలో ఫిట్‌గా ఉన్నట్లు సీవోఈ ధ్రువీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. ఐపీఎల్ తర్వాత హార్దిక్ పోటీ క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ప్రస్తుతం బెంగళూరులోనే ఉంటూ శిక్షణ పొందేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఆకాశ్ దీప్ కూడా కొన్ని నెలలుగా సీవోఈలో పునరావాస కార్యక్రమంలో ఉన్నాడు.

### ఆఫ్ఘాన్ సిరీస్‌కు నలుగురికి ఫిట్‌నెస్ పరీక్ష

సెప్టెంబరు 13 నుంచి ఆఫ్ఘానిస్థాన్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో బుమ్రా, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణాలను ఫిట్‌నెస్‌కు లోబడి ఎంపిక చేశారు. వీరంతా ప్రస్తుతం 'రిటర్న్ టు ప్లే' విధానాన్ని అనుసరిస్తున్నారు. మ్యాచ్ సిమ్యులేషన్‌తోపాటు నిర్దేశిత ఫిట్‌నెస్ ప్రక్రియలను పూర్తి చేసిన తర్వాతే సీవోఈ వారిని పూర్తి స్థాయిలో ఫిట్‌గా ప్రకటించనుంది.



2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికలో భాగంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాల భవిష్యత్తుపైనా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. కోహ్లీ, జడేజాల విషయంలో ప్రస్తుతం పెద్దగా ఆందోళన లేకపోయినా.. రోహిత్ భవిష్యత్తుపై మాత్రం ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఇంగ్లండ్ పర్యటనలో లార్డ్స్ వన్డే అనంతరం రోహిత్ రిటైర్మెంట్‌పై సెలెక్టర్లలో చర్చ జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఆ మ్యాచ్‌లో అతడు సెంచరీ చేయడంతో కనీసం ప్రస్తుతానికి రిటైర్మెంట్ అంశాన్ని పక్కన పెట్టినట్లు తెలుస్తోంది.
అయినప్పటికీ వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లే భారత జట్టులో రోహిత్ ఉంటాడా లేదా అన్నదానిపై ఇంకా స్పష్టత లేదు.

### అగార్కర్ కొనసాగింపుపైనా నిర్ణయం

అగార్కర్ ప్రస్తుత ఒప్పందం అక్టోబరు 4తో ముగియనుంది. అయితే 2027 వన్డే ప్రపంచకప్ వరకు ఆయనను కొనసాగించడంపై బీసీసీఐ ఆసక్తి చూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కీలక పర్యటనలు, ప్రపంచకప్ సన్నాహకాలను దృష్టిలో పెట్టుకుని గంభీర్, అగార్కర్, లక్ష్మణ్ మధ్య సమన్వయం మరింత మెరుగ్గా ఉండేలా ఒకే వ్యూహంతో ముందుకు సాగడంపైనా సమావేశంలో చర్చించనున్నారు.



## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో
# గిల్, బుమ్రా డౌన్!

### తొమ్మిదో స్థానానికి శుభ్‌మన్.. మూడో ర్యాంక్‌కు జస్ప్రీత్
### ఐదు స్థానాలు ఎగబాకిన పడిక్కల్

**దుబాయ్:** తాజా ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండు స్థానాలు దిగజారి తొమ్మిదో ర్యాంక్‌కు చేరగా.. జస్ప్రీత్ బుమ్రా బౌలర్ల జాబితాలో రెండో స్థానం నుంచి మూడో స్థానానికి పడిపోయాడు. మరోవైపు శ్రీలంక పర్యటనలో మెరిసిన దేవదత్ పడిక్కల్ ఐదు స్థానాలు ఎగబాకి 54వ ర్యాంక్‌కు చేరాడు. శ్రీలంక పర్యటనలో మూడు ఇన్నింగ్స్‌ల్లో గిల్ ఒక అర్ధసెంచరీ మాత్రమే చేయడంతో అతడి ర్యాంక్ పడిపోయింది. భారత బ్యాటర్లలో రిషభ్ పంత్ ఏడో స్థానంతో అత్యుత్తమ ర్యాంక్‌లో ఉండగా.. యశస్వి జైస్వాల్ 11వ స్థానంలో కొనసాగుతున్నాడు. రెండు టెస్టుల్లో 328 పరుగులు, రెండు సెంచరీలు చేసిన పడిక్కల్ ఐదు స్థానాలు మెరుగుపరుచుకున్నాడు. మోకాలి గాయంతో జులై మధ్య నుంచి క్రికెట్‌కు దూరంగా ఉన్న బుమ్రా.. ఆస్ట్రేలియా మిచెల్ స్టార్క్, న్యూజిలాండ్ మాట్ హెన్రీ తర్వాత మూడో స్థానంలో నిలిచాడు. సెప్టెంబరు మధ్యలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగే మూడు టీ20లకు ఎంపికైనా అతడి అందుబాటు ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంది. శ్రీలంక బ్యాటర్ సోనాల్ దినుషా భారత్‌తో రెండో టెస్టులో సెంచరీలతో ఆకట్టుకుని ఏకంగా 29 స్థానాలు ఎగబాకి 25వ ర్యాంక్‌కు చేరాడు.

# మళ్లీ తొలి రౌండ్‌లోనే ఔట్

### చైనా మాస్టర్స్‌లో కెనడా షట్లర్ విక్టర్ లై చేతిలో లక్ష్య సేన్ పరాజయం
### శ్రీకాంత్, తన్వీ శర్మకు వరుస గేముల్లో విజయాలు

**షెన్‌జెన్:** భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. కెనడాకు చెందిన ప్రపంచ 9వ ర్యాంకర్ విక్టర్ లై చేతిలో 14–21, 7–21తో కేవలం 38 నిమిషాల్లో ఓడిపోయాడు. గత నెల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన లైతో లక్ష్యకు ఇది మూడో ఓటమి. ఈ ఏడాది మార్చిలో ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో మాత్రమే అతడిపై లక్ష్య విజయం సాధించాడు.



మరోవైపు కిదాంబి శ్రీకాంత్ చైనీస్ తైపీకి చెందిన చి యు జెన్‌పై 21–16, 21–15తో గెలిచి రెండో రౌండ్‌కు చేరాడు. తదుపరి మ్యాచ్‌లో విక్టర్ లైతో శ్రీకాంత్ తలపడనున్నాడు. తైపీ ఓపెన్‌లో గత నెల తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ సాధించిన 17 ఏళ్ల తన్వీ శర్మ కూడా రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. డెన్మార్క్ క్రీడాకారిణి అమాలీ షుల్జ్‌ను 21–16, 21–17తో ఓడించింది. తదుపరి జపాన్‌కు చెందిన తోమోకా మియాజాకితో తలపడనుంది.

### సాత్విక్–చిరాగ్ ముందుకు

పురుషుల డబుల్స్‌లో ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేతలు సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి–చిరాగ్ శెట్టి జోడీ 21–11, 21–16తో మలేసియాకు చెందిన జునైదీ అరిఫ్–కాంగ్ ఖై జింగ్‌ను ఓడించింది. తదుపరి ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో, తోమా జూనియర్ పొపోవ్ సోదరులతో ఆడనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల–తనిషా క్రాస్టో జోడీ 21–8, 21–9తో థాయ్‌లాండ్ జోడీని ఓడించి రెండో రౌండ్‌కు చేరింది. అయితే మహిళల సింగిల్స్‌లో దేవికా సిహాగ్, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్–రుత్విక గద్దె జోడీలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాయి.

# డబ్ల్యూఎస్‌కేలో అతికా మీర్ మెరుపులు!

### రెండు రేసుల్లోనూ నాలుగో స్థానం
### ఫైనల్లో ప్రమాదంతో ముగిసిన పోరాటం
### సెటప్ సమస్యలను అధిగమించి ఆకట్టుకున్న 11ఏళ్ల భారత కార్టింగ్ ప్రతిభ

**ఫ్రాన్సియాకోర్టా (ఇటలీ):** భారత యువ కార్టింగ్ సంచలనం అతికా మీర్ డబ్ల్యూఎస్‌కే ఫైనల్ కప్ తొలి రౌండ్‌లో సత్తా చాటింది. సెటప్ సమస్యలతో క్వాలిఫయింగ్‌లో తొమ్మిదో స్థానానికే పరిమితమైనా.. రేస్–1, రేస్–2ల్లో అద్భుతమైన ఆరంభాలతో ముందుకు దూసుకెళ్లి వరుసగా నాలుగో స్థానాలు సాధించింది. 72 మంది డ్రైవర్లలో హీట్స్ అనంతరం 14వ స్థానంలో నిలిచింది. ప్రీ–ఫైనల్‌లో ఏడో గ్రిడ్ నుంచి బరిలోకి దిగిన అతికా.. ఎక్కువసేపు ఐదో స్థానంలో కొనసాగి చివరకు తొమ్మిదో స్థానంతో ముగించింది. ఫైనల్లో ప్రమాదానికి గురై కార్ట్ దెబ్బతినడంతో రేసు నుంచి వైదొలిగింది. ఎఫ్1 అకాడమీ మద్దతు పొందిన తొలి భారతీయురాలైన అతికా.. వేగం విషయంలో ఇబ్బందులున్నా చాలా రేసుల్లో పోరాడినట్లు తెలిపింది. ఫ్రాన్సియాకోర్టా సుదీర్ఘ స్ట్రెయిట్‌లలో వేగం లేకపోవడం తమను దెబ్బతీసిందని పేర్కొంది. అతికా తండ్రి, భారత తొలి జాతీయ కార్టింగ్ ఛాంపియన్ అసిఫ్ మీర్ మాట్లాడుతూ.. వేగవంతమైన కార్ట్ లేకపోయినా ఆమె రేస్ క్రాఫ్ట్, పరిణతిని ప్రదర్శించిందని, చివరి వరకు పోరాడిన తీరు ఆకట్టుకుందని అన్నాడు. అతికా తదుపరి స్పెయిన్‌లో జరిగే చాంపియన్స్ ఆఫ్ ది ఫ్యూచర్ అకాడమీ నాలుగో రౌండ్‌లో పోటీపడనుంది. ఈ ఏడాది గ్రీస్ రౌండ్‌లో ఆమె విజేతగా నిలిచింది.





# పండుగ సీజన్.. అమెజాన్‌లో 1.6 లక్షల ఉద్యోగాలు!

### దేశవ్యాప్తంగా 400 నగరాల్లో సీజనల్ అవకాశాలు
### మెట్రోలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ నియామకాలు

న్యూఢిల్లీ: పండుగ సీజన్ నేపథ్యంలో అమెజాన్ ఇండియా దేశవ్యాప్తంగా 1.60 లక్షలకు పైగా సీజనల్ ఉద్యోగ అవకాశాలను కల్పించినట్లు బుధవారం ప్రకటించింది. ఈ–కామర్స్, క్విక్ కామర్స్ వ్యాపారాలకు మద్దతుగా ఉన్న సంస్థ కార్యకలాపాల నెట్‌వర్క్‌లో ఈ నియామకాలు చేపట్టింది. ఇప్పటికే అత్యధిక మంది సిబ్బందిని నియమించుకుని, అవసరమైన శిక్షణ కూడా అందిస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు దేశంలోని 400 నగరాల్లో అందుబాటులో ఉన్నాయి. మెట్రో నగరాలతోపాటు వారణాసి, కొచ్చి, జలంధర్, ఘాజియాబాద్, రాంచీ, సేలం, గోరఖ్‌పూర్ వంటి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ నియామకాలు చేపట్టినట్లు అమెజాన్ పేర్కొంది. కొత్తగా చేరిన సిబ్బంది ఆర్డర్లను ఎంపిక చేయడం, ప్యాకింగ్, రవాణా, డెలివరీ వంటి కార్యకలాపాల్లో సేవలందించనున్నారు. పండుగ సీజన్‌లో పెరిగే వినియోగదారుల డిమాండ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ అదనపు సిబ్బంది ఉపయోగపడతారని అమెజాన్ ఇండియా ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ అభినవ్ సింగ్ తెలిపారు.



### మీషోలో 10 లక్షల అవకాశాలు

పండుగ సీజన్‌లో ఈ–కామర్స్ రంగంలో భారీగా ఉద్యోగ అవకాశాలు ఏర్పడుతున్నాయి. గత నెలలో మీషో తన విక్రేతలు, లాజిస్టిక్స్ వ్యవస్థ ద్వారా 10 లక్షలకు పైగా సీజనల్ ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు ప్రకటించింది. ఇందులో విక్రేతల నెట్‌వర్క్‌లో సుమారు 6.5 లక్షలు, లాజిస్టిక్స్ కార్యకలాపాల్లో 3.75 లక్షల ఉద్యోగాలు ఉండనున్నాయి.

### 2030 నాటికి 34,500 కోట్ల డాలర్లు

క్విక్ కామర్స్ విస్తరణ, కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంతో భారత ఈ–కామర్స్ రంగం 2030 నాటికి 34,500 కోట్ల డాలర్లకు చేరుతుందని తాజా నివేదిక అంచనా వేసింది. 2024లో ఉన్న 12,500 కోట్ల డాలర్ల మార్కెట్‌తో పోలిస్తే ఇది దాదాపు మూడు రెట్లు అధికం. 2030 వరకు ఈ రంగం సగటున 18.4 శాతం వార్షిక వృద్ధి రేటుతో పెరుగుతుందని ఇన్ఫిసమ్ నివేదిక పేర్కొంది.

# ఐసీ ఎలక్ట్రికల్స్‌కు రూ.7 కోట్ల ఆర్డర్లు

### రైల్వే నుంచి రూ.6 కోట్లు.. ఎగుమతి ఆర్డర్ రూ.కోటి
### వివిధ విద్యుత్, ఎలక్ట్రానిక్ పరికరాల సరఫరా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: ఐసీ ఎలక్ట్రికల్స్ కంపెనీకి సుమారు రూ.7 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు లభించాయి. భారత రైల్వేలోని వివిధ డివిజన్ల నుంచి సుమారు రూ.6 కోట్ల విలువైన విద్యుత్, ఎలక్ట్రానిక్ పరికరాల సరఫరాకు కొనుగోలు ఉత్తర్వులు వచ్చినట్లు సంస్థ తెలిపింది. మరో రూ.కోటి విలువైన ఎగుమతి ఆర్డర్ కూడా దక్కినట్లు వెల్లడించింది. రెగ్యులేటర్లు, బ్యాటరీ ఛార్జర్లు, ఎమర్జెన్సీ లైట్లు, ఇన్వర్టర్లు, మైక్రోప్రాసెసర్ ఆధారిత కంట్రోల్ సిస్టమ్స్, విజిలెన్స్ కంట్రోల్ పరికరాలు, ఆల్టర్నేటర్లు, ట్రాక్షన్ మోటార్లు, పర్మనెంట్ మాగ్నెట్ ఆల్టర్నేటర్లు తదితరాలను సంస్థ రైల్వేకు సరఫరా చేయనుంది.



### ఎగుమతుల విస్తరణ

తాజా ఆర్డర్లతో దేశీయ రైల్వే రంగంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లలో వ్యాపారాన్ని విస్తరించేందుకు అవకాశం లభించిందని సంస్థ ఎండీ సునీల్ కుమార్ వర్మ తెలిపారు. రైల్వే ఎలక్ట్రానిక్స్, రొటేటింగ్ ఎలక్ట్రికల్ పరికరాలు, విద్యుదీకరణ పరిష్కారాల్లో సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. హరిద్వార్‌లో మూడు తయారీ కేంద్రాలు, ప్రత్యేక పరిశోధన–అభివృద్ధి విభాగాలు ఉన్నాయని సంస్థ పేర్కొంది.

# ఏటా 500 గోల్డ్ లోన్ శాఖలు!

### ఐదేళ్లలో 2,500–3,000 బ్రాంచ్‌లకు ఎల్అండ్‌టీ ఫైనాన్స్
### ప్రస్తుత 343 నుంచి ఈ ఏడాది చివరికి 800కు పెంపు

అహ్మదాబాద్: గోల్డ్ లోన్ వ్యాపారాన్ని విస్తరించేందుకు ఎల్అండ్‌టీ ఫైనాన్స్ ప్రతి ఏడాది కనీసం 500 కొత్త శాఖలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వచ్చే నాలుగైదేళ్లలో మొత్తం శాఖల సంఖ్యను 2,500–3,000కు పెంచనున్నట్లు సంస్థ హోల్‌టైమ్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాజు దొడ్డి తెలిపారు. ప్రస్తుతం 343 శాఖలు ఉండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 800కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. విస్తరణను దేశవ్యాప్తంగా చేపట్టనున్నామని దొడ్డి తెలిపారు. ఏటా ఏర్పాటు చేసే 500 శాఖల్లో కనీసం 100 పశ్చిమ ప్రాంతంలో ఉంటాయని, గుజరాత్‌లో 50–60 కొత్త శాఖలను ప్రారంభిస్తామని చెప్పారు. రాష్ట్రాల వారీగా కేటాయింపులు ఆయా ప్రాంతాల మార్కెట్ పరిస్థితులను బట్టి ఉంటాయన్నారు.



### గోల్డ్ లోన్లలో 50%కిపైగా వృద్ధి

జూన్ 2026 నాటికి ఎల్అండ్‌టీ ఫైనాన్స్ గోల్డ్ ఫైనాన్స్ రుణ పుస్తకం సుమారు రూ.3,800 కోట్లుగా ఉంది. 2026 తొలి త్రైమాసికంలో ఇది వార్షిక ప్రాతిపదికన 182 శాతం పెరిగి రూ.3,829 కోట్లకు చేరింది. మొత్తం రుణ పుస్తకం ఏటా 20–25 శాతం, గోల్డ్ ఫైనాన్స్ వ్యాపారం 50–60 శాతానికి పైగా వృద్ధి చెందుతుందని దొడ్డి అంచనా వేశారు. భారత కుటుంబాల వద్ద సుమారు 28,000 టన్నుల బంగారం ఉండగా.. అందులో కేవలం 8 శాతం మాత్రమే నగదీకరణ అవుతోందని తెలిపారు. దేశ గోల్డ్ లోన్ మార్కెట్ సుమారు రూ.20–21 లక్షల కోట్లుగా ఉందని, అసంఘటిత రంగం నుంచి వ్యవస్థీకృత రుణ సంస్థలకు మార్కెట్ వాటా పెంచుకునే అవకాశం ఉందన్నారు.

# నంబర్–2పై హ్యుందాయ్ గురి!

### కొత్త ఎస్‌యూవీలతో దూకుడు
### వచ్చే ఏడాది నాటికి ఈవీ విక్రయాల్లో 7శాతానికి చేరాలని లక్ష్యం

**న్యూఢిల్లీ:** దేశీయ ప్యాసింజర్ వాహన మార్కెట్‌లో కోల్పోయిన రెండో స్థానాన్ని తిరిగి దక్కించుకునేందుకు హ్యుందాయ్ మోటార్ ఇండియా దూకుడుగా ముందుకెళ్తోంది. పండుగ సీజన్‌లో కొత్త మిడ్‌సైజ్ ఎస్‌యూవీని, ఆ తర్వాత సబ్–4 మీటర్ విభాగంలో ప్రత్యేక ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని విడుదల చేయనున్నట్లు సంస్థ ఎండీ, సీఈఓ తరుణ్ గార్గ్ తెలిపారు. కొత్త మోడళ్ల రాకతో రెండో అర్ధభాగంలో పరిశ్రమ వృద్ధి కంటే మెరుగైన పనితీరు సాధిస్తామని చెప్పారు. పరిశ్రమ 5–6 శాతం వృద్ధి చెందవచ్చని అంచనా ఉండగా.. హ్యుందాయ్ 8–10 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఏప్రిల్–ఆగస్టులో ఇప్పటికే సంస్థ సుమారు 13 శాతం వృద్ధిని నమోదు చేసిందన్నారు.

### ఉత్పత్తి సామర్థ్యం పెంపు

కోల్పోయిన నంబర్–2 స్థానాన్ని తిరిగి సాధించడంపై తమకు ఎంతో పట్టుదల ఉందని గార్గ్ చెప్పారు.



ఆగస్టు వాహన్ రిజిస్ట్రేషన్ల ప్రకారం ఐసీఈ వాహనాల విభాగంలో తాము రెండో స్థానంలో ఉన్నామని తెలిపారు. పుణె ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుత 1.7 లక్షల యూనిట్ల నుంచి 2028 నాటికి 2.5 లక్షలకు, 2030 నాటికి 3 లక్షలకు పెంచనున్నారు. చెన్నై ప్లాంట్ సామర్థ్యం 8.24 లక్షల యూనిట్లు. దీంతో మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 11.24 లక్షల యూనిట్లకు చేరనుంది.

### ఈవీలకు ప్రాధాన్యం

ప్రస్తుతం పరిశ్రమలో ఈవీల వాటా సుమారు 7 శాతంగా ఉందని గార్గ్ తెలిపారు. క్రెటా ఈవీ నెలకు దాదాపు 1,000 యూనిట్లు విక్రయిస్తుండగా.. కొత్త ఈవీ, క్రెటా ఈవీ, ఐయోనిక్–5 మోడళ్లతో వచ్చే ఏడాదికి పరిశ్రమ స్థాయి ఈవీ వాటాను అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పండుగ సీజన్ అమ్మకాలపై కూడా హ్యుందాయ్ ఆశావహంగా ఉంది. ఓణం సందర్భంగా గత ఏడాదితో పోలిస్తే అమ్మకాలు రెట్టింపయ్యాయని గార్గ్ తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌యూవీలకు ఆదరణ పెరుగుతోందని, గత త్రైమాసికంలో గ్రామీణ మార్కెట్‌లో హ్యుందాయ్ చొచ్చుకుపోవడం రికార్డు స్థాయిలో 26 శాతానికి చేరిందన్నారు.

# మూడో రోజూ మార్కెట్ల పతనం

### 374 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
### 24వేల దిగువకు నిఫ్టీ



**ముంబై:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత ముదరడం, అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు, చమురు ధరలు పెరగడం దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపాయి. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిశాయి. ఆటో, ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 373.93 పాయింట్లు (0.49 శాతం) నష్టపోయి 76,570.35 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 808.56 పాయిం ట్లు క్షీణించి 76,135.72కు చేరింది. నిఫ్టీ 141.35 పాయింట్లు (0.59 శాతం) తగ్గి 23,914.45 వద్ద ముగిసింది. రోజులో 23,786.80 కనిష్ఠాన్ని తాకింది.

### ఆటో, ఐటీ షేర్లపై ఒత్తిడి

సెన్సెక్స్–30లో ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫోసిస్ ప్రధానంగా నష్టపో యాయి. మరోవైపు అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, టైటన్ లాభపడ్డాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.61 శాతం, మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.51 శాతం చొప్పున పడిపోయాయి. రంగా ల వారీగా ఆటో సూచీ 1.68 శాతం క్షీణించి అత్యధిక నష్టాన్ని నమోదు చేసింది. ఐటీ 1.17 శాతం, ఫోకస్డ్ ఐటీ 1.10 శాతం, ఇన్సూరెన్స్ 1.09 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.08 శాతం నష్టపోయాయి.

### చమురు ధరలతో ఆందోళన

పశ్చిమాసియాలో అమెరికా–ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడం, హోర్ముజ్ జలసంధి త్వరగా తెరుచుకుంటుందన్న ఆశలు సన్నగిల్లడంతో ఇంధన సరఫరాలపై ఆందోళనలు పెరిగాయని మార్కెట్ నిపుణులు తెలిపారు. అంతర్జాతీయ చమురు బెంచ్‌మార్క్ బ్రెంట్ ధర 0.40 శాతం పెరిగి బ్యారెల్‌కు 95.13 డాలర్లకు చేరింది. పెరుగుతున్న ముడిచ మురు ధరలు, ప్రపంచవ్యాప్తంగా పెరిగిన బాండ్ ఈల్డ్స్ పెట్టుబడిదారుల రిస్క్ ఆసక్తిని తగ్గించాయని



## నీ ప్రతి అడుగు పదిమంది మేలు కోసమే

### పవన్‌కు చిరు శుభాకాంక్షలు

తనను గెలిపించిన పిఠాపురం ప్రజలకు ఒక ప్రజాప్రతినిధిగా కాకుండా, కుటుంబ సభ్యుడిలా పవన్ కల్యాణ్ అండగా నిలుస్తున్నాడని చిరంజీవి అన్నారు. నేడు పవన్ పుట్టినరోజు సందర్భంగా ఎక్స్ వేదికగా చిరు శుభాకాంక్షలు తెలిపారు. తమ్ముడిని చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. పవన్ సంకల్ప సాధకుడని ప్రశంసించారు.

''నిబద్ధత, బాధ్యత, అనుక్షణం ప్రజలకు మంచి చేయాలనే చిత్తశుద్ధి.. ఇవన్నీ మా కల్యాణ్ బాబులో చిన్నప్పటి నుంచి చూస్తున్నాను. తాను చేసే ప్రతి పనిలో పూర్తిగా నిమగ్నమవుతూ, తన ప్రతి అడుగూ పదిమందికి మేలు చేయాలనే తపనతో వేస్తాడు. మా కుటుంబంపై ఎంత ప్రేమ చూపిస్తాడో.. తనను నమ్మిన ప్రజలపైనా అంతే ప్రేమ చూపిస్తాడు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ, ప్రజల మౌలిక అవసరాల కల్పన కోసం అంకితభావంతో పనిచేస్తూ.. పాలనలో తనదైన ముద్ర వేస్తున్నాడు. ఏళ్లుగా పరిష్కారం కాని ఎన్నో సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపిస్తూ, మారుమూల ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నాడు. పవన్‌ను ఇలా చూస్తుంటే ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించే కల్యాణ్ బాబు.. ప్రతి అడుగులోనూ విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

**ప్రజలకు ఎంతో చేశారనడానికి ఇదే నిదర్శనం:** పవన్‌కు సతీమణి విషెస్

**పుట్టినరోజు శుభాకాంక్షలు పవర్ స్టార్ పవన్ కల్యాణ్:** అల్లు అర్జున్

**అప్పటికీ.. ఇప్పటికీ.. మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉంటాం. హ్యాపీ బర్త్‌డే పవన్:** హరీశ్ శంకర్

**కొందరు ప్రజల జీవితాలలో ఒక భాగం అయిపోతారు. అలాంటి ఒకే ఒక్క పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు:** గోపిచంద్ మలినేని

**పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. మీ ప్రయాణం ఎన్నో తరాలకు స్ఫూర్తి:** అనిల్ రావిపూడి

# నేపాల్ నువ్వు ఒంటరివి కావు

### బాధితులకు అండగా సోనూ సూద్

కరోనా లాక్‌డౌన్ కష్ట కాలంలో వలస కార్మికులకు అండగా నిలిచి 'రియల్ హీరో' అనిపించుకున్నారు నటుడు సోనూ సూద్. ఇప్పుడు నేపాల్ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చారు. ఇటీవల నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో 1000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన నిత్యావసరాలు, సహాయక సామగ్రితో నేపాల్ రాజధాని కాఠ్‌మాండూ వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. సోషల్ మీడియా వేదికగా కొన్ని విషయాలు పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.

''పునరావాస కేంద్రాల్లోని చిన్నారులను చూస్తుంటే మనసు ముక్కలవుతోంది. చాలామంది పిల్లల తల్లిదండ్రులు వరదల్లో కనిపించకుండా పోయారు. మనమెంత నిస్సహాయులమో వాళ్లను చూస్తే అర్థమవుతోంది. నేను ఓ పునరావాస కేంద్రానికి వెళ్లినప్పుడు క్రిస్టినా అనే 8 ఏళ్ల చిన్నారిని కలిశాను. తమ్ముడితో ఉన్న ఆ పాప నా వైపు చూసి నవ్వుతూ.. 'అంతా సర్దుకుంటుంది' అని చెప్పింది. నేను కారు ఎక్కే వరకు ఆ చిన్నారి నా వెంటే ఉంది. ఆ పాపను దత్తత తీసుకోవాలనిపించింది. కానీ ఏమీ చేయలేని స్థితిలో ఉన్నాను'' అని సోనూ సూద్ ఆవేదన వ్యక్తం చేశారు. ''మనం సురక్షిత ప్రాంతాల్లో ఉన్నందుకు అదృష్టవంతులం. మీరెంత బిజీగా ఉన్నా.. ఇలాంటి కుటుంబాల కోసం కాస్త సమయం కేటాయించండి. మీకు చేతనైనంత విరాళాలు పంపండి. ఇలాంటి విపత్తులు వచ్చినప్పుడు ఆదుకోవడం ప్రభుత్వం, మంత్రుల బాధ్యత మాత్రమే అనుకోవద్దు. ఒక మనిషిగా, భారతీయుడిగా ఇది మనందరి బాధ్యత'' అని అన్నారు. ''వాళ్లు తమ ఇళ్లను, కుటుంబాలను, అందమైన బాల్యాన్ని కోల్పోయారు. మనమంతా కలసి వారికి ఓ కొత్త జీవితాన్ని అందిద్దాం. నేపాల్.. నువ్వు ఒంటరివి కావు'' అని సోనూ సూద్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చారు.





## మాది నాస్తిక భావాల కుటుంబం

### హీరోయిన్ శృతి హాసన్


మల్టీ టాలెంట్‌తో ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న హీరోయిన్ శృతి హాసన్.. ప్రస్తుతం వరుస సినిమాలు చేస్తూ బిజీ లైఫ్‌ను లీడ్ చేస్తుంది. దేవుడు అంటే ఎంతో భక్తి ఉండే ఈ అమ్మడు.. తాజాగా మరోసారి వారాహి అమ్మన్ ఆలయంలో దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మికతపై ఆమె చేసిన కామెంట్స్ మరోసారి వైరల్ అవుతున్నాయి. 'మాది నాస్తిక భావాలు కలిగిన కుటుంబం. మా అమ్మగారు (సారిక) ఆధ్యాత్మిక చింతన కలిగినవారు, కానీ మా నాన్నగారు (కమల్ హాసన్) మాత్రం ఎప్పుడూ అలా ఉండేవారు కాదు. అందుకే, మేము పెరిగేటప్పుడు మా ఇంట్లో దేవుడు అనే భావన ఉండేది కాదు. ఆ తర్వాత నేనే స్వయంగా ఆ విషయాన్ని తెలుసుకున్నాను. దేవుని శక్తిని నేను బలంగా నమ్ముతాను. నా జీవితంలో అనేక దశలను దాటడానికి, ఎన్నో విజయాలను సాధించడానికి ఆ శక్తే నాకు తోడుగా నిలిచింది. నేను మొదటిసారిగా ఒక ఆలయానికి మా తాతగారితో కలిసి వెళ్లాను. ఆయన నన్ను చెన్నైలోని ఒక ఆలయానికి తీసుకెళ్లారు. అయితే, ఆయన నన్ను ఆలయానికి తీసుకెళ్లిన విషయాన్ని మా నాన్నగారికి చెప్పవద్దని నాతో చెప్పారు. ఆ తర్వాత కొద్ది కాలానికే మా తాతగారు కన్నుమూశారు. మా తాతగారితోనూ, ఆ ఆలయంతోనూ నాకు ఎప్పుడూ ఒక ప్రత్యేక అనుబంధం ఉండేది. అది నాకు ఒక రకమైన ఆధ్యాత్మిక అనుబంధంగా మారింది' అంటూ చెప్పుకొచ్చింది. ప్రజెంట్ ఈ వ్యాఖ్యలు మరోసారి నెట్టింట సందడి చేస్తున్నాయి.

## మమితా బైజుకు అస్వస్థత

### పరిస్థితి చాలా కష్టంగా ఉందంటూ వీడియో


యంగ్ హీరోయిన్ మమితా బైజు తాజాగా అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు మమిత ఓ వీడియో రిలీజ్ చేస్తూ.. నా పరిస్థితి ప్రస్తుతం చాలా కష్టంగా ఉంది. బాగా ఫీవర్, బాడీ పెయిన్స్ ఉన్నాయి. ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు తాను పూర్తిగా విశ్రాంతి తీసుకుంటున్నట్లు స్వయంగా తెలిపింది. అలాగే.. ఆమె అస్వస్థత కారణంగా ఆస్ట్రేలియా పర్యటన రద్దయింది. మెల్‌బోర్న్‌లో జరగబోయే క్లైడ్ ఓనమ్ 2026 వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉండగా.. మమిత హెల్త్ కండిషన్ సరిగ్గా లేకపోవడంతో, నిర్వాహకులు ఈ వేడుకలను వాయిదా వేసినట్లు క్లైడ్ మలయాళీ అసోసియేషన్ వెల్లడించింది. ప్రస్తుతం మమిత రిలీజ్ చేసిన వీడియో వైరల్ అవుతుండగా.. అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. ఆమె త్వరగా కోలుకోవాలంటూ మెసేజులు చేస్తున్నారు. ఇక మమిత బ్యాక్ టు బ్యాక్ విజయాలు బాక్సాఫీస్ వద్ద సక్సెస్ ఫుల్ హీరోయిన్‌గా రాణిస్తుంది. అంతే కాకుండా.. ఆమె నటించిన మూడు చిత్రాలు నెల రోజుల వ్యవధిలోనే విడుదలై రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా.. మలయాళంలో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న 'బెత్లెహోమ్ కుటుంబం యూనిట్' సెప్టెంబర్ 4న తెలుగులో విడుదల అయ్యేందుకు సిద్ధంగా ఉంది.





## అక్టోబర్ 15 'జైలర్ 2' విడుదల

మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'జైలర్'. అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ చిత్రానికి సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా విడుదల ఖరారైంది. 'జైలర్ 2' రిలీజ్ డేట్‌పై ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్నప్పటికీ తాజాగా టీమ్ అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 15న దీన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపింది. 'జైలర్'లో పలు భాషలకు చెందిన అగ్రతారలు అతిథి పాత్రల్లో మెరిసిన విషయం తెలిసిందే. రెండో భాగంలోనూ ఆ సందడి కొనసాగనుంది. సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగం ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే సీక్వెల్ ప్రారంభమవుతుందని గతంలో శివరాజ్ కుమార్ తెలిపారు.




Printed, Published & Owned by YAMJALA PRAVEEN, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published From 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, and Telangana - 508252. Editor: YAMJALA PRAVEEN, PRGI.No. TGTEL/26/A6221, Ph.No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website : www.tholivelugu.com